

# మెహెర్‌బాబా

అవతార్ మెహెర్‌బాబాకే అంకితమైన మాసపత్రిక

సంపుటి :13   సంచిక: 10  హైదరాబాద్     2014  జనవరి     పేజీలు 40

Please visit :  www.srimeherbaba.com     వార్షిక సభ్యత్వం : రూ. 100/-

# యాప్రాల్‌లో ఏకాహం

## 9-2-2014 ఆదివారం ఉ.5 నుండి సా.5 దాకా.

**ఫిబ్రవరి 9, ఆదివారం ఉదయం 5 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకూ** ప్లాట్ నెం.32, గోదావరి గార్డెన్స్, బాబాస్ హౌస్, యాప్రాల్, సికింద్రాబాద్ (99595-53218) అవతారుని ఏకాహం ఏర్పాటు చేయడమైంది. బాబా ప్రేమికులందరూ వీలుచూసుకుని ఈ ఏకనామంలో పాల్గొనవల్సిందిగా శ్రీ మల్లాది కృష్ణానంద్ కోరుతున్నారు.

యాప్రాల్ చేరుటకు సికింద్రాబాద్‌లో వున్న పాస్‌పోర్టు ఆఫీసు నుండి సిటీ బస్సు నంబరు 24, 24బి (యాప్రాల్‌లోని వాటర్ ట్యాంక్ స్టేజి, ఆంధ్రా బ్యాంక్ ఎదుట) ప్రతి ఐదు నిముషాలకు వుంది. కాగా, సొంత వాహనాలలో వచ్చువారు తిరుమలగిరి జంక్షన్ నుంచి యాప్రాల్ వాటర్ ట్యాంక్ స్టేజి, ఆంధ్రా బ్యాంక్ దగ్గర నుండి అర్ధ కిలోమీటరు దూరంలో గోదావరి గార్డెన్సు, ప్లాట్ నంబరు 32 కలదు. ఏకనామంలో కొన్ని క్షణాలైనా పాల్గొనాలనుకోవడం అవతారుడు కల్పించిన ఒక మహత్తర అవకాశంగా భావించాలని, వీలు చూసుకుని బాబా ప్రేమికులందరూ హాజరుకావల్సిందిగా శ్రీ మల్లాది కోరుతున్నారు.

# ఆంధ్రా రెస్టు హౌస్

అమరతిథికి విచ్చేసే బాబా ప్రేమికులందరికీ ఆంధ్రా రెస్టు హౌస్ స్వాగతం పలుకుతోంది. అమరతిథి సందర్భంగా ఆంధ్రా రెస్టు హౌస్‌లో భోజన, వసతి కోరుకునే వారు తక్షణం వారి వారి వివరాలను మేనేజర్, ఆంధ్రా రెస్టు హౌస్, బి.ఎస్.ఎన్.ఎల్. టవర్ ఎదురుగా, మెహెరాబాద్, ఆరంగాం గ్రామం, అహ్మద్‌నగర్ జిల్లా, ఫోన్: **09848 11671** తెలియజేయవల్సిందిగా యాజమాన్యం కోరుతున్నారు.

## జలనిధి

గత కొంత కాలంగా, అంటే 2013 అక్టోబరు మాసంలో శ్రీ వై.యస్. రావు బాబాలో ఐక్యమయినప్పటి నుండీ రెస్టు హౌస్‌కు విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రతిరోజు స్థానికంగా ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేసి సరఫరా చేస్తునట్లు, తద్వారా అధిక ఆర్థిక భారాన్ని భరించవల్సివచ్చిందని అన్నారు. ఈ ఆర్థిక లోటును పూరించవల్సిన ఆవశ్యకత ఎంతో వుందని చెబుతూ శ్రీ వై.యస్. రావు గారు ఏర్పాటు చేసిన **'జలనిధి'కి** తగిన విరాళాలు అందజేసి సహకరించవల్సిందిగా యాజమాన్యం కోరుతున్నారు. రెస్టు హౌసులో మీరు చెల్లించే లేదా అందజేసే విరాళాలకు స్థానిక మేనేజర్, ఆంధ్రా రెస్టు హౌస్ నుండి 'రశీదు' తప్పక పొందవల్సిందని అన్నారు.

## బాబా సందేశం

**భగవంతునికి – మీకూ మధ్య అడ్డుతెర ఏమిటి?**

**మీలోని 'నేను' అనే అహంకారమే!!**

**What is the veil between you and God?**

**It is only your ego.**

**–మెహెర్‌బాబా**


**గౌరవ సంపాదకులు**

**మల్లాది కృష్ణానంద్**

**99595–53218,**

**krishnanandm@yahoo.com**

**malladisukku@gmail.com**

**వ్యవస్థాపకులు:**

**దశిక ప్రసాదరావు**

**040-65699611**


## లోపలి పేజీలలో...


1. సంపాదకీయం 5
2. అమరతిథి 6–7
3. మెహెర్‌బాబా సమాధి 8–11
4. కొత్త పుస్తకం 12
5. మా మాటలు 13–19
6. లార్డ్ మెహెర్ 20–23
7. మెహెరాబాద్‌లో దర్శనీయ స్థలాలు 24–32
8. జమా ఖర్చులు 33–95
9. సింహావలోకనం 36–37
10. ప్రార్థనలు


**ముఖ చిత్రం..**

అవతారుడికి 1932లో కాలిఫోర్నిలో తీసిన అరుదైన చిత్రం. గ్లో సౌజన్యం.,


**ఉత్తర ప్రత్యుత్తరాలకు**

ఎడిటర్,

మెహెర్‌బాబా,

గోదావరి గార్డెన్స్, యాప్రాల్,

ప్లాట్ నెం. 32,

జె.జె. నగర్‌కాలనీ ,

సికింద్రాబాద్–500 087

ఫోన్: 99595–53218


### మనవి

**మీ వ్యాసాలు, లేఖలు ఇతర సమాచారం మాకు ప్రతినెల 4వ తేదీ లోపల అందేలా పంపవలసింది. పత్రికను ప్రతినెల 19 లేదా 20వ తేదీలలో పోస్టు చేస్తున్నాం. 25వ తేదీలోగా పత్రిక మీ ముంగిట ఉంటుంది.**

Please visit : www.srimeherbaba.com

# అమరతిథి- బస

మెహెరాబాద్ అమరతిథిలో హైదరాబాద్ నుండి విచ్చేసే స్త్రీ, పురుష బాబా ప్రేమికులందరికీ న్యూ సైట్‌లో బస ఏర్పాటు చేసినట్లు శ్రీ నోరి మెహెర్‌చంద్ ఒక ప్రకటనలో తెలిపారు. కాగా, శ్రీకాకుళం నుండి నెల్లూరు దాకా అన్నట్లు విచ్చేసే తెలుగు బాబా ప్రేమికులందరికీ పురుషులకు బి-హాస్టలు, స్త్రీలకు హెచ్- టెంట్ కేటాయించినట్లు ఆయన అన్నారు.

చలిని తట్టుకునేందుకు తగిన ఉన్ని దుస్తులు తమ వెంట తెచ్చుకోవాలని శ్రీ నోరి సూచిస్తున్నారు. హైదరాబాద్ నుండి సుమారు వెయ్యిమంది బాబా ప్రేమికులు హాజరయ్యే అవకాశం ఉందని, వారిలో 150 మంది వాలంటీర్లున్నారని ఆయన అన్నారు.

# నుమాయిష్

హైదరాబాద్‌లోని నాంపల్లి దగ్గర ప్రతి ఏటా ఏర్పాటు చేసే పారిశ్రామిక ఎగ్జిబిషన్‌లో పలు ఆధ్యాత్మిక కేంద్రాల నడుమ, ఎగ్జిబిషన్ సొసైటీ వారి రేడియో స్టేషన్ ఎదురుగా అవతార్ మెహెర్‌బాబా స్టాలు ఏర్పాటు చేసినట్లు శ్రీమతి నోరి స్వర్ణ తెలిపారు. 2014 జనవరి 8న డాక్టర్ చంద్రమాల ఈ కేంద్రాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ప్రతి రోజూ సాయంత్రం 5 నుండి రాత్రి 9.30 వరకు పలువురు బాబా ప్రేమికులు విచ్చేసే సందర్శకులకు అందుబాటులో ఉంటారు. ఏదేని సహాయార్థం శ్రీ పి.ఎస్.కె. శర్మ (94418 35036) సంప్రదించగలరు. వీలున్నవారంతా బాబా స్టాలును తప్పక సందర్శించవల్సిందిగా శ్రీమతి స్వర్ణ కోరుతున్నారు.

# మెహెర్ మండపేట

రాజమండ్రికి సమీపంలోని మెహెర్ మండపేటలో అవతార్ మెహెర్‌బాబా తన ఆంధ్ర పర్యటనలో భాగంగా ప్రజా దర్శనం ఇచ్చారు. మెహెర్‌బాబా మండపేట సందర్శించి 60 సంవత్సరాలు నిండుతున్న సందర్భంగా 03.03.2014 సోమవారం ఉ. 8 నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ ప్రత్యేక ప్రేమిక సహవాస్ ఏర్పాటు చేసినట్లు శ్రీ సి.ఎ. చౌదరి, శ్రీ పనసన్న (9030605678) ఒక ప్రకటనలో తెలిపారు.

## శ్రీ మహేశ్వరరావు గారి ఇంట సత్సంగ్

కాగా, శ్రీ ఎన్. మహేశ్వరరావు గారింట్లో, వెంకటాపురం, హైదరాబాద్‌లో బాబా సత్సంగ్ ఫిబ్రవరి 10, సోమవారం సా. 6 నుండి 8 గంటల వరకు ఏర్పాటు చేశామని ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు ఫోన్ 94412 18841 సంప్రదించగలరు.

# సంపాదకీయం తిన్నగా ఇళ్ళకెళ్ళండి!!

గమనించండి!! మెహెరాబాద్ అమరతిథికి హాజరయ్యేవారందరూ మీ తిరుగు ప్రయాణంలో తిన్నగా మీ ఇళ్ళకెళ్ళండి. బాబాను మీతో మీ ఇళ్ళకు తీసుకెళ్ళండి !! ఇది అవతారుని ఆదేశం. మెహెర్‌బాబా స్వయంగా చెప్పిన మాటలివి. 1955 నవంబరులో మెహెరాబాద్‌లో జరిగిన మరాఠీ ప్రేమికుల సహవాస్‌లో ఈ విషయాన్ని బాబా చాలా స్పష్టంగా చెప్పారు. సహవాస్‌లో ఆఖరి రోజున అందరూ తమ ఇళ్ళకు బయల్దేరారు. వారితో బాబా – మీరిక్కడ నుండి తిన్నగా మీ ఇళ్ళకు వెళ్ళండి. మీతోపాటు నన్ను మీ హృదయాల్లో పదిలంగా తీసుకెళ్ళండి. మీకేమైనా వ్యాపారసంబంధ లావాదేవీలుంటే, ముందుగా మీ ఇంటికి వెళ్ళి, ఆ తర్వాత మీరెక్కడికైనా వెళ్ళండి. అలాకాని పక్షంలో, మీరు సహవాస్ కోసం 50%, మీ పనుల కోసం 50% మీ సమయాన్ని కేటాయించినట్లన్నారు. దారిలో ఎక్కడా ఆగవద్దని హెచ్చరించారు. బాబావారి సంజ్ఞలను మరాఠీ భాషలోకి అనువాదం చేస్తున్న బాబా ప్రేమికుడు –శ్రీ ధాకే ఫాల్కర్, **బాబా చెప్పిన మాటలకు అదనంగా పండరీపూర్, షిరిడి, సాకోరీలకు** కూడా వెళ్ళరాదని ప్రకటించాడు. బాబా ఈ మాటలతో చికాకు పడ్డారు. ధాకే ఆ మాదిరిగా నోరుజారడంతో, ఎవరైతే ఆ మూడు ప్రదేశాలకు వెళ్ళాలనుకుంటున్నారో హాయిగా వెళ్ళమని, తానిచ్చిన ఆదేశాలను సడలిస్తున్నానన్నారు బాబా. మీరెక్కడకు వెళ్ళాలనుకుంటే అక్కడకి మీరెళ్ళొచ్చు. ఐతే, అదే పనిమీద వెళ్ళొద్దు. మీరు అక్కడకు వెళ్ళకూడదని నా ఉద్దేశ్యం కాదు. మెహెరాబాద్‌కు రావడమంటే అది తీర్థయాత్రలకే తీర్థయాత్రని గమనించమన్నారు. కానీ, ధాకే తన అనువాదంతో తీవ్ర గందరగోళం సృష్టించాడు కాబట్టి, ఎవరైతే షిరిడి, సాకోరీ, పండరీ వెళ్ళాలనుకుంటారో వారు దివ్యంగా వెళ్ళండని బాబా అన్నారు. నేను చెప్పేదానిలో ఒక అక్షరం అటు ఇటుగా మార్చి చెబితే అనేక అపోహలు కలిగే అవకాశం ఉందన్నారు బాబా. బాబావారి మాటల్ని తిరిగి మరాఠీలో అనువదించలేకపోయాడు ధాకే. కళ్ళనీళ్ళపర్యంతమయ్యాడు. తిరిగి బాబా సంజ్ఞలతో, మీరు నేరుగా మీ ఇళ్ళకు వెళ్ళండి. అన్ని ప్రాంతాలూ నావే అన్నారు. నా దగ్గరకు వచ్చి, తిరిగి మీ సొంత పనుల కోసం అక్కడికీ ఇక్కడికీ వెళ్ళరాదు. మీరంతగా ఇష్టపడితే మీ ఇళ్ళకెళ్ళి ఆ దరిమలా మరోమారు షిరిడి, సాకోరి, పండరిలకు వెళ్ళండని బాబా సూచించారు. బాబా ఇంత సుదీర్ఘ వివరణ ఇచ్చాక కూడా ఓ పెద్దాయన లేచి తను నేరుగా ఇంటికి వెళ్ళడానికి గల కష్టాలేవో చెప్పుకొచ్చాడు. వ్యక్తిగతంగా కష్టాలుండవచ్చు. వాటి పరిష్కారమార్గాలు మీ చేతుల్లోనే వుంటాయి. నేను చెప్పదల్చినదేదో చెప్పాను. తెలుగు గ్రూపు సహవాస్‌కు కట్టా సుబ్బారావు వచ్చాడు. అతను ఇక్కడ వుండగా ఆతని వ్యాపారం కోసం బొంబాయికి వెళ్ళమని మూడు టెలిగ్రాంలు, ఒక అర్జంటు ఫోన్ కాల్ వచ్చింది. అతను ఏం చేయ్యాలని నన్ను అడిగాడు. నేను చెప్పింది చేయాలనుకుంటే ముందుగా నీవు నీ ఇంటికి వెళ్ళు. ఆ తర్వాత బొంబాయికి వెళ్ళమని చెప్పాను. అలాగే చేశాడతను. నీనిక్కడ వున్నది మీసమస్యలు తీర్చడానికి కాదు. **అవన్నీ అముఖ్యం** అని, బాబా ఆ ప్రస్తావన అంతటితో ముగించారు.

# అమరతిథి




**మల్లాది కృష్ణానంద్**

అమరతిథి విశిష్టతపై బాబా ట్రస్టు, చైర్మన్ భావూ కల్చూరి బాబా ప్రేమికులను ఉద్దేశించి గతంలో చేసిన స్వాగతోపన్యాసం ఇలా ఉంది. దయచేసి పరిశీలించండి.

"ప్రియతమ మెహెర్‌బాబా సశరీరులుగా మనల్ని కలవటం మానేసిన రోజుని అమరతిథి గుర్తుచేస్తుంది. అవతారుడు సర్వే సర్వత్రా వున్న వైనానికి అద్దం పడుతుందీ రోజు. ప్రియతమ బాబా భౌతికంగా మన మధ్యన లేకపోయినా తమ కార్యక్రమాల్ని యాధావిధిగా నిర్వహిస్తున్నారు.

ఇది వారి విశ్వకార్యక్రమం. అది ఏమిటో మనకెవ్వరికీ అంతుబట్టదు. ఆ సంగతి అలా వుంచితే, బాబావారు సశరీరులుగా వున్నప్పుడు తమ కార్యక్రమాన్ని రెండు స్థాయిలో చేసేవారు. ఒకటి మనందరి కళ్ళకి కనిపించే భౌతిక ప్రపంచం, రెండవవది మన కళ్ళకి కనబడని ఆంతరంగిక ప్రపంచం ద్వారా తమ దగ్గరకి వచ్చిన అందరి సంస్కారాలనీ ఆయన తీసుకొనేవారు. తన వద్దకు రాని వారికీ ఈ వరాన్ని ప్రసాదించే వారు.

సద్గురువులు ఐదుగురు. వీరి బాధ్యతలు దైవీ ప్రణాళిక ప్రకారం వుంటాయి. అవతారుని పని యావత్తు సృష్టినీ ఆధ్యాత్మికంగా ముందుకు ఒక్క త్రోపు త్రోయటం.

ఈ పని సద్గురువులు వల్ల కాదు. వాళ్ళు చేయలేరు. అందుకనే భగవంతుడు మానవ రూపం ధరించి అవతరిస్తున్నది. ప్రపంచాన్ని ఆధ్యాత్మికంగా ముందుకు తీసుకువెళ్ళేది.

ముందుకు తీసుకు వెళ్ళటమేమిటి? ఒక్క త్రోపు తోయట మేమిటి?

అవతారుడు ప్రాణి కోటి యొక్క చైతన్య స్థాయిని పెంచుతాడు. వాయు దశ నుంచి అన్ని దశల్లోని ప్రాణులకీ అవతారుని వరం లభిస్తుంది. రాయి, లోహం, కూరాకు పురుగు, చేప, పక్షి, జంతువు వంటి వివిధ దశల్లోని ఆత్మకీ, మనుష్యులకీ కూడా అవతారుడు వల్ల చైతన్య స్థాయి పెరుగుతుంది.

సద్గురువు కూడా చైత్య స్థాయిని పెంచగలడు. అయితే ఆయన మండలి (సర్కిల్) లో వారికి మాత్రమే అలా చేయగలడాయన. కుక్క, పిల్లి, చిలుక వంటి పెంపుడు జంతువులకి కూడా సద్గురువు చైతన్య స్థాయిని పైకి త్రోయ గలడు. కానీ, అవతారునిలా, ప్రాణులందరకీ, ఆధ్యాత్మిక లబ్ధిని కల్గించలేడు. అందుకనే, అవతారుడు దిగి వస్తున్నాడు. యావత్తు మానవాళికి ఆధ్యాత్మికోన్నతి కల్గిస్తున్నాడు. ప్రపంచంలో ఎన్నో మతాలున్నాయి. ఎందరో అవతార పురుషులున్నారు. ఒక్కో మతానికి వొక్కో అవతారుడు. మతాలు వేరైనా అవతారుడు ఒక్కడే. జొరాస్టరు, మెహెర్‌బాబా ఒక్కరే. ప్రతి యుగంలో భూమిపై అవతరిస్తున్న పరాత్పరుడు వొక్కడే. పేరు, రూపం, రంగు వేరు అంతే.

అలా ఎందుకు అంటే, ఆయా కాలమాన పరిస్థితులకి తగ్గట్టుగా పై నుంచి దిగి వస్తాడు పరిస్థితులకి తగ్గట్టు ప్రవర్తిస్తాడు. ఐతే, ప్రజలకీ సంగతి అర్థం కాదు. ఒక్కటే అన్న భావన తెలియక మతాల మధ్య అడ్డుగోడలు కట్టుకుని ఒకరిపై ఒకరు కత్తులు దూస్తాము. రక్తపాతం సృష్టిస్తాము. ఈ మతాల మధ్య వైరుధ్యం, పోరాటం – ఇద్దరు సోదరులు కొట్టుకోవటమే. ఒకరి నొకరు చంపుకోవటమే. మనం మతాల మధ్య బేధ భావం సృష్టించ కూడదు.

ఈ వేళ అమరతిథి నాడు ఈ సంగతి మనం బాగా గుర్తుంచుకోవాలి. యుగ యుగాలుగా అవతరిస్తున్న దేవ దేవుడు ఒక్కడేనన్న నగ్న సత్యాల్ని మనం బాగా జ్ఞాపకం పెట్టుకోవాలి. మనం అదృష్టవంతులం. అందుకే మనకీ ఎరుక కలిగింది. మనం మతం వెనుక కాకుండా, ఈ మతాలు ఘోషించే సత్య సూక్తం వైపు కదిలి వెళ్ళాలి.

అవతారుడు శరీరం వదిలిపెట్టినా, సజీవంగానే వుంటారు. తమ విశ్వ కార్యక్రమాన్ని నిర్వహిస్తూనే వుంటారు. ఒక రోజా, రెండు రోజులా, వందేళ్ళ వరకూ అవతారుడు చురుకుగా పనిచేస్తూనే వుంటారు. ఈ కాలంలో మీరు పిలిచినా, పిలవక పోయినా మీకు సహాయం చెస్తాడు. అయితే వంద ఏళ్ళు అయ్యాక ఆయన విశ్రాంతికి వెళ్ళి పోతాడు. అప్పుడు కేవలం పిలిచితే పలికే దైవం – అవతారుడు.

బాబా సశరీరం వదిలి 45 సంవత్సరాలయింది. విశ్వ వ్యక్తీకరణ 55 సంవత్సరాలు పడుతుంది. ఈ వచ్చే 55సంవత్సరాలు బాబా ఎప్పటిలానే మన మధ్య భౌతికంగా వున్నట్లుగానే వుంటారు. ఆ దరిమిలా మనస్ఫూర్తిగా పిలిస్తే పలుకుతారు.

అవతారుడు సర్వ శక్తిమంతుడు.

ఆయనకి రేపు లేదు. నిన్న అసలే లేదు. భగవంతునికి వున్నది కేవలం నేడు మాత్రమే. పరాత్పరుడికి అన్ని రోజులు నేటి క్రిందనే లెఖ్ఖ. మరచిపోకండి. అమరతిథి కూడా అంతే.

నిన్న, రేపు లేదు. అమరతిథికి కేవలం ఈ వేళ మాత్రమే.

నిన్న, రేపు మరచి పోవాలి.

అప్పుడే మనకి 'నేడు' ఈనాడుగా మారుతుంది.

# ప్రత్యేకం మెహెర్‌బాబా సమాధి



మెహెర్‌బాబా 1894 ఫిబ్రవరి 25న పూనేలో జన్మించారు. మెహెరాబాద్‌కు 1923 మే నెలలో వచ్చారు. మెహెర్‌బాబా సమాధి చిన్న ఎత్తైన కొండపైన వుంది. ఈ ప్రాంగణాన్ని ఎగువ మెహెరాబాద్ అని, ప్రధాన రహదారికి ప్రక్కనే గల ప్రాంతాన్ని దిగువ మెహెరాబాద్ అని వ్యవహారికంగా పిలుస్తున్నారు. ఈ ఎగువ - దిగువ మెహెరాబాద్‌ల నడుమ డోన్ - అహ్మద్‌నగర్‌లకు వెళ్ళే రైలు మార్గం వుంది. ఈ రైలు మార్గానికి సమీపంలో మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో వినియోగించిన ఒక పోస్టాఫీసు భవనం వుంది. ఈ భవంతిలో ఓ పెద్ద హాలు, వరండా మాత్రం వుండేది. మెహెరాబాద్‌కు బాబా క్రొత్తగా వచ్చిన రోజుల్లో ఈ పోస్టాఫీసు బిల్డింగు ఒక్కటే కాస్త నివాసయోగ్యంగా వుండేది. దాంతో మెహెర్‌బాబా, ఆయన మండలి సభ్యులు ఈ భవనంలోనే వుండేవారు. బాబా తన అవతార కార్యక్రమంలో భాగంగా మెహెరాబాద్‌లో చాలాకాలం వున్నారు. ఆది 1927 ఏప్రిల్ నెలలో ఓ రోజున ఎగువ మెహెరాబాద్‌లో వాహ్యాళిగా తిరుగుతూ, ఒక ప్రదేశంలో ఆగి ఓ పెద్ద గొయ్యిని త్రవ్వమని తన మండలివారిని ఆదేశించారు. ఈ గొయ్యి ఆరు అడుగుల పొడవు, ఆరడుగులు లోతు, నాలుగు అడుగులు వెడల్పు ఉండేలా త్రవ్వారు. ఈ పని 1927 జూలై - ఆగష్టు నెలలో జరిగింది.

బాబా తరచు ఇక్కడ ఏకాంతవాసం వున్నారు.

ఐతే, 1927 డిశంబరు 20 న ఏకాంతవాసం ఉంటానని వెళ్ళిన అవతారుడు 1928 ఫిబ్రవరి 26 దాకా ఈ గొయ్యిలోనే ఉన్నారు. ఆ రోజుల్లో ఈ గొయ్యిగదిపై తాత్కాలికంగా

రేకులతో ఓ ఆచ్ఛాదన ఏర్పాటు చేశారు. 1930లో పోస్టాఫీసు గదిని పడగొట్టేయాలని ప్రభుత్వం తాకీదు ఇచ్చింది. ఆ ప్రాంతమంతా రైల్వే శాఖవారికి చెందుతుందని పేర్కొన్నారు. దాంతో పోస్టాఫీసును పడగొట్టేశారు. ఈ పోస్టాఫీసును పడగొట్టగా వచ్చిన రాళ్ళతో ఎగువ మెహెరాబాద్‌లో బాబా ఏకాంతవాసమున్న గొయ్యి గదిపై నేడు మనం చూస్తున్న రీతిలో గది, డోం నిర్మాణం బాబావారి ఆదేశాల ప్రకారం 1938లో చేపట్టారు.

ఆ మాదిరిగా మెహెరాబాద్‌లో తొలి రోజులలో బాబా బస చేసిన పోస్టాఫీసుకు – నేటి బాబా సమాధికి మనకు తెలియని లింకు వుంది. Samadhi has become the divine Post office of the Avatar... అని బాబా ప్రేమికులు అభివర్ణిస్తారు.

ఆ రోజుల్లో మెహెర్‌బాబా ఏకాంతవాసం వుండే ఈ గొయ్యి గది రాబోయే రోజుల్లో మెహెర్‌బాబా సమాధిగా వుంటుందని ఎవరూ వూహించ లేదు. ఆ దరిమలా 1938 ప్రాంతంలో ఓ స్విర్జలాండ్ దేశీయురాలు, బాబా ప్రేమికురాలు, **హెలెన్ డాహమ్** అనే ఆమె బాబా సమాధిలోని ఆ ఎగుడు దిగుడు రాళ్ళపై అందమైన కుడ్య చిత్రాలను పెయింట్ చేసింది. అలాగే, సమాధికి ఉత్తరాన గల కిటికీని మూసివేసి ఒక ప్లే వుడ్‌పై బాబా వారి చిత్రాన్ని ఆమె అందంగా చిత్రించి అలంకరించింది. బాబా ఈ కుడ్య చిత్రాలను ఎంతగానో అభిమానించారు. ఐతే వాటి spiritual significance మాత్రం బాబా ఏమీ ప్రత్యేకంగా చెప్పలేదు.

ఆ తర్వాత కొంతకాలానికి ఉత్తరాన కిటికీవైపు వున్న ఫోటో తీసేసి కిటికీని తెరచి వుంచారు. అలా చాలాకాలం వుంది. ఆ తర్వాత మెహెర్‌బాబా ఓ సందర్భంలో **రానో గెల్లీ** అనే మరో పాశ్చాత్య బాబా ప్రేమికురాలిని తెల్లని సాద్రాతో తాను కూర్చున్నట్లు వుండే చిత్రాన్ని గీయమన్నారు. నేడు ఈ చిత్రం దిగువ మెహెరాబాద్‌లో రాహూరీ క్యాబిన్‌లో అమర్చారు. సమాధి గదిలో ఉత్తరాన గల కిటికీకి హెలెన్ అమర్చిన చిత్రాన్ని తీసివేసి మరొక చిత్రం ఏదైనా ఏర్పాటు చేయాలా? బాబా అని రానో అడిగితే..... ఇప్పుడే కాదు... ఆ తర్వాత చూద్దాం అని బాబా క్లుప్తంగా అన్నారు.

ఆ తర్వాత 1969 జనవరి 31న భౌతిక దేహం వదిలేశాక, బాబా సమాధిలో ఉత్తర కిటికీ భాగంలో బాబా ప్రేమికులు శ్రీ మంత్రవాది శ్రీరామమూర్తి గారు తీసిన ఫోటోను వుంచారు. ఈ ఫోటో ఫ్రేం చిత్రం బాబా సమాధిలో దాదాపు రెండున్నర దశాబ్దాలు పైగా వుంది. ఆ తర్వాత ఈ ఫోటోను సమాధి ప్రక్కనే వున్న బాబా గదిలో అమర్చారు. బాబా సమాధి అయిన తర్వాత ఈ ఫోటోలో బాబా మెడలో వేసి వున్న పూలహారంలో **మెహెరామాయి** రూపం దర్శనమిచ్చేది. ఇది సమాధిలో వున్న ఫోటోలో మాత్రమే కాదు. అలాంటి ఫోటోలున్న అందరి బాబా ప్రేమికుల ఇళ్ళలో చాలా స్పష్టంగా మెహెరామాయి ముఖ భాగం స్పష్టంగా కనపడింది. ఆ దరిమలా ఉత్తర కిటికీ వైపు తెల్లని సాద్రా ధరించిన అవతారుదు మెహెరాబాద్‌లో కూర్చున్నట్లు వున్న అందమైన

తైలవర్ణ చిత్రాన్ని 1993 మార్చి 21న ఏర్పాటు చేశారు. ఈ చిత్రాన్ని 1933 ప్రాంతంలో పాశ్చాత్య బాబా ప్రేమికురాలు, ఎలిజిబెత్ పేటర్‌సన్, ఇటలీలో తీసింది. బాబా సమాధిలో ఈ చిత్రం బాగుంటుందని మెహెరామాయి సూచించింది.

అమెరికా దేశీయుడైన ప్రముఖ చిత్రకారుడు **చార్లీ మోర్‌టన్** ఈ చిత్రాన్ని గీసాడు.

1954,1955 లో బాబా స్వయంగా తన ప్రేమిక బృందాన్ని ఈ ప్రాంగణానికి తీసుకువచ్చారు. ఆ దరిమలా ఈ ప్రాంతాన్ని తన సమాధి ప్రాంగణంగా, రాబోయే 75 సంవత్సరాలలో ఓ గొప్ప యాత్రా స్థలమౌతుందని చెప్పారు.

మెహెర్‌బాబా 1969 జనవరి 31న దేహ త్యాగం చేశాక బాబా నివాసముంటున్న మెహెరాజాద్ నుండి నేరుగా ఆయన భౌతిక దేహాన్ని ఇక్కడకు తీసుకు వచ్చారు. బాబా ప్రేమికుల దర్శనార్థం ఏడు రోజులపాటు ఉంచారు. ఆ ఏడు రోజులూ, రాత్రిం పగళ్ళు – 24 గంటలూ బాబా ప్రేమికులు అవతారుడిని దర్శించుకున్నారు. సాధారణ మానవులకు తుది శ్వాస వదిలిన కొన్ని గంటల్లోపే అంత్యక్రియలు నిర్వహించడం కద్దు. లేనిపక్షంలో మానవ దేహంలో అనేక పరిణామాలు తలెత్తి, పరిస్థితులు విపత్కరంగా వుంటాయని మనమందరకూ తెలుసు. ఐతే, 1969 జనవరి 31 మధ్యాహ్నం 12.15 నిముషాలకు మెహెర్‌బాబా భౌతిక దేహం వదిలినా ఏడు రోజులపాటు ఆయన శరీరంలో ఎలాంటి మార్పులూ లేవు. ఏడు రోజుల తర్వాత కూడా ఆయన ముఖం చిరునవ్వులు చిందిస్తున్నట్లే ప్రశాంతం వుంది. ఆ వదనాన్ని బాబా ప్రేమికులు ఎందరో దర్శించుకున్నారు.

బాబా ప్రేమికులు దేశ, విదేశాల్లో వున్నవారు ఎందరో బాబా దేహం వదిలేశారని పలు ప్రసార మాధ్యమాల ద్వారా తెలుసుకుని హుటాహుటిన, ఉన్నఫళంగా మెహెరాబాద్‌కు బయలుదేరారు. మేం వస్తున్నాం.. మాకు బాబా దర్శనం ఇప్పించండని టెలిగ్రాంలు ఇచ్చారు. వారి ఆవేదనలు అభ్యర్ధనలు అర్ధం చేసుకున్న మండలివారు, బాబా దేహాన్ని అలా ఏ రోజుకారోజు అన్నట్లు ఏడు రోజులపాటు గొయ్యి గదిలోనే వుంచారు. అప్పటికీ స్థానిక వైద్యులు తక్షణం సమాధి ఏర్పాట్లు చేపట్టాలని, లేదంటే బాబా దేహం పాడైపోగలదని హెచ్చరించారు. కానీ, ప్రేమికుల ఒత్తిడులకే మండలి ప్రాధాన్యత ఇయ్యవల్సివచ్చింది. అమెరికా, యూరోప్ తదితర దేశాల నుండి, మన దేశంలోని అనేక మారుమూల ప్రాంతాల నుండి ప్రేమికులు అశేష సంఖ్యలో ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి, తమ ప్రియతముడిని ఆనాడు దర్శించుకున్నారు. ఆనాడు అవతారుడిని దర్శించుకున్న విశేష ప్రేమిక జనవాహినిలో ఈ వ్యాస రచయిత కూడా వున్నాడు. అప్పుడు నా వయస్సు కేవలం పది సంవత్సరాలు. మెహెర్‌బాబాని సమాధిలో వుంచిన నాల్గవ రోజు నుంచి ఏడవ రోజు దాకా మా అమ్మ సుశీలా కృష్ణతో బాబా

సమాధి ప్రాంగణంలో గడిపాను. అవతారుని పాద స్పర్శ, దర్శన భాగ్యం పొందాను.

అనంతరం, ఏడవ రోజైన-1969 ఫిబ్రవరి 7, మధ్యాహ్నం 12.15 నిముషాలకు - మెహెర్‌బాబా భౌతిక దేహంపై ఎర్రని మృత్తిక చల్లేందుకు విచ్చేసిన బాబా ప్రేమికులందరికీ అందజేశారు. బాబా ప్రేమికులు తలా ఒక పిడికిలి చేతపట్టారు.

జొరాస్ట్రియన్ క్యాలెండర్ ప్రకారం ఆ రోజు మెహెర్‌బాబా పుట్టిన రోజయ్యింది.

ఇదంతా మనకు కాకతాళీయం.

కానీ అవతారునికి అంతా అవగతమే.

I AM NEVER BORN.

I NEVER DIE.

YET EVERY MOMENT I TAKE BIRTH AND UNDERGO DEATH. ALTHOUGH I AM PRESENT EVERYWHERE ETERNALLY IN MY FORMLESS INFINITE STATE, FROM TIME TO TIME I TAKE FORM. THIS TAKING OF FORM AND LEAVING IT IS TERMED MY PHYSICAL BIRTH AND DEATH.

ఇది మెహెర్‌బాబా తన ప్రేమికులకు ఇచ్చిన సందేశం.

ఇది అక్షర సత్యం.

నమ్మినవారికి కొంగు బంగారం. కంటికి రెప్పలా తన ప్రేమికులను మెహెర్‌బాబా కాపాడతారు. నిత్యం వారి మనస్సుల్లో వచ్చే అశేష ప్రశ్నలకు క్షణంలో జవాబిస్తాడాయన.

ఐతే, ఇది వ్యక్తిగతం. ప్రతివారి హృదయాల్లో వున్న మెహెర్‌బాబా, వారి హృదయాల్లో నిత్యం సంభాషించే మౌన, ప్రేమావతారుడు. దివ్యావతారుడిని నమ్మి భజియించడం, తరించడం మన పూర్వజన్మ సుకృతం.

ఆ దరిమలా, 1971 నవంబరు 14, ఆదివారం రోజున బాబా సమాధిపై ఇటాలియన్ పాలరాయిని ఏర్పాటు చేశారు. ఆ పాలరాయిపై ఇలా చెక్కించారు.

**ETERNAL BELOVED**
**AVATAR MEHER BABA**
**FEBRUARY 25 1894 - JANUARY 31 1969**

**I HAVE COME NOT TO TEACH BUT TO AWAKEN**

ఆ దివ్య ప్రాంగణం **2014 జనవరి 31న** విశేష బాబా ప్రేమిక జన సందోహంతో కళ కళలాడబోనుంది. వారందిరికీ ఈ వ్యాసంతో, మెహెర్‌బాబా పత్రిక పక్షాన ప్రత్యేక స్వాగతం పలుకుతున్నాం. జైబాబా...

# పుస్తకావిష్కరణ



క్రొత్త తెలుగు పుస్తకం సార్థకజన్ములు జనవరి 11న స్థానిక కోఠి సెంటర్‌లో శ్రీ బుడే క్రిష్ణయ్య, సెంట్రల్ ఎక్సైజ్ సూపరింటెండెంట్, రిటైర్డ్ లాంఛనంగా అవిష్కరించారు. మెహెరాబాద్‌లో వుంటున్న బాబా ప్రేమికులు శ్రీ అన్నాఖండాలే ఇంగ్లీషులో ప్రచురించిన **టియర్స్ ఆఫ్ ది జాయ్** పుస్తకాన్ని శ్రీ మల్లాది కృష్ణానంద్ తెలుగులో అనువదించి, ఆ చిరుపొత్తానికి సార్థకజన్ములు అని పేరు పెట్టారు. మెహెర్‌బాబాకు ఎంతో విధేయతతో సంపూర్ణంగా అంకితమై జీవించిన ముగ్గురు పెద్దలు వరుసగా **1.** గుస్తాద్‌జీ, **2.** ప్లీడర్ **3.** కృష్ణనాయర్‌ల జీవనరేఖాచిత్రాలు ఈ చిన్ని గ్రంథంలో ఎంతో వివరంగా గ్రంథస్తం చేయడమైంది. సాక్షాత్తూ యుగావతారుని నీడలో నడుచుకున్న ఆ ముగ్గురూ ధన్యులు, సార్థకజన్ములు అని రచయిత అభిప్రాయపడ్డారు. ఈ ముగ్గురూ అవతారుని తొలితరానికి చెందిన అత్యంత సన్నిహిత ప్రేమికులు. అవతారుని ఆదేశాలు వారు అమలు చేసిన వైనం, నేటి తరం బాబా ప్రేమికులు తప్పక తెలుసుకోవాలి. ఇదొక అరుదైన సమాచారం. తెలుగువారందరూ తప్పక చదివి బధ్రపరుచుకోవల్సిన గ్రంథం. **వెల రూ. 50/- ప్రాప్తిస్థానం- ఎడిటర్, మెహెర్‌బాబా, గోదావరి గార్డెన్స్, బాబాస్ హౌస్, యాప్రాల్, ప్లాట్ నెం.32, జె.జె. నగర్ కాలనీ, సికింద్రాబాద్-500087. ఫోన్:99595-53218, malladisukku@gmail.com**



# నూతన బాబా ట్రస్టు చైర్మన్

అవతార్ మెహెర్ బాబా ట్రస్టుకు నూతన చైర్మన్‌గా శ్రీ శ్రీధర్ కేల్కర్‌ను నియమించినట్లు బోర్డు ఆఫ్ ట్రస్టీలు ప్రకటించారు. ఇప్పటి దాకా చైర్మన్‌గా వ్యవహరించిన శ్రీ భావూ కల్చూరీ 2013 అక్టోబరు 23న బాబాలో ఐక్యమయ్యాక, 2013 డిసెంబరు 15న ఏర్పాటు చేసిన ఒక ప్రత్యేక సమావేశంలో శ్రీధర్ కేల్కర్‌ను ట్రస్టు చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు ప్రకటించారు.

2013 డిసెంబరు 15న మెహెర్‌బాబావారి సోదరి మణీజామాయి పుట్టిన రోజున ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రస్తుత నియమావళి ప్రకారం చైర్మన్‌గా ఎంపికయన వారు ఆ పదవిలో ఐదేళ్ళు మాత్రమే కొనసాగుతారు. ఆ దరిమిలా మరో ఐదేళ్ళు వరకు రెండవ విడత పొడిగించే అవకాశం వుందని, బాబా ట్రస్టు ఒక ప్రకటనలో స్పష్టం చేసింది.

# శీతల చరణం



శీతల చరణం- కోమల చరణం
మధుర చరణం- మెహెరు చరణం ॥శీ॥

మెహెరు చరణం పరమ శరణం
పాప హరణం - భవ తరణం ॥శీ॥

చరణ స్మరణం - జ్ఞాన స్ఫురణం
మాయా మరణం - జాగరణం ॥శీ॥

- శ్రీ మంత్రవాది శ్రీరామమూర్తి





# నివాళి

మా తల్లిగారు శ్రీమతి సుశీలాకృష్ణ (1999 జనవరి 4) - అలాగే ఆమెకు తమ్ముడు, మా మేనమామ మెహెర్‌బాబా పత్రిక వ్యవస్థాపకులు, శ్రీ దశిక ప్రసాదరావు (2004 జనవరి 24) బాబాలో ఐక్యమయ్యారు. వారిని 2014 జనవరి సంచిక ద్వారా స్మరించుకుంటున్నాం.

మా తల్లి- సుశీలా కృష్ణ స్వీయ రచనలో వెలువడిన చక్కని పాట **"నిన్ను మరచి ఉండ లేనయ్యా"** అని అవతారుడిని ఆమె స్మరిస్తూ ఆలాపించే కీర్తనను, ఆమెను స్మరించుకుంటూ ప్రచురిస్తున్నాం. దయచేసి పరిశీలించగలరు.

**- ఎడిటర్**

**భూలే బిసరే గీత్**

## "నిన్ను మరచి ఉండ లేనయ్యా"

నిన్ను మరచి ఉండ లేనయా,
పింపలవాసా, నిన్ను మరచి ఉండలేనయా,
నిన్ను మరచి ఉండలేను, కన్న తండ్రివగుటచేసి,
ఎన్న బోకు చేసిన నేరములను,
షిరీను కుమార మెహెరు బాబా ॥నిన్ను॥

సర్వమునకు కర్త నీవె,
సర్వమునకు భోక్త నీవె,
సర్వమునకు ఆర్త నీవు,
పరమ పురుష మెహెరు బాబా... ॥ నిన్ను॥

పూనా వాస మెహెరు బాబ,
నీవె నీడ మాకు బాబా,
కావుమయ్యా శరణు, శరణు, దేవ, దేవ.
మెహెరు బాబా... ॥ నిన్ను॥

## బాబాలో ఐక్యం

శ్రీ ఓం ప్రకాశ్ గారి భార్య, శ్రీమతి కస్తూరి, హైదరాబాద్ 06.01.2014లో అవతారునిలో ఐక్యమయ్యారు. ఆమె గత కొంత కాలం అస్వస్థతతో వున్నారు. శ్రీమతి కస్తూరి బాబావారి అన్ని కార్యక్రమాలకు ఏడాది పొడుగూతా క్రమం తప్పక హాజరయ్యేవారని, నిరంతరం బాబా నామస్మరణలో గడిపిన ధన్యజీవి శ్రీమతి కస్తూరి అని స్థానిక బాబా ప్రేమికులు కొనియాడారు.

## బాబాలో ఐక్యం

మచిలీపట్నం బాబా ప్రేమికులు శ్రీమతి కూనపని సువర్చలా దేవి 01.01.2014 బాబాలో ఐక్యమయ్యారు. ఆమె తూర్పు, పశ్చిమ సహవాస్, పూనేలో పాల్గొన్నారు. ఆమె మచిలీపట్నం సెంటర్‌లో గత అర్ధ శతాబ్దంపైగా బాబా కార్యక్రమాలలో పాల్గొని తన పాటలతో అలరించేవారు. బాలగోపాల భాస్కరరాజు గారి పాటలు ఎన్నో ఆమె పాడేవారని శ్రీ తాడేపల్లి మెహెర్‌బాబా ఒక ప్రకటనలో తెలిపారు.

## మచిలీపట్నం

అవతార్ మెహెర్‌బాబా మచిలీపట్నం సెంటర్‌లో జన్మ దినోత్సవ కార్యక్రమాలు 01.01.2014 నుండి ప్రారంభమయినాయి. అవతార్ మెహెర్ బాబా మచిలీపట్నం వచ్చి 60 సంవత్సరాలు నిండుతున్న సందర్భంగా 22.02.2014 న ప్రత్యేక సహవాస్ కార్యక్రమం స్థానిక సెంటర్‌లో ఏర్పాటు చేసినట్లు శ్రీ తాడేపల్లి మెహెర్‌బాబా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా శ్రీ మెహెర్‌చంద్ నోరి, హైదరాబాద్, శ్రీ ఎ.వి.జి. హరిప్రసాద్, బెంగుళూరు, శ్రీ మెహెర్ ఈశ, చెన్నై, శ్రీమతి జి. సుబ్బలక్ష్మి, విజయవాడ పాల్గొంటున్నారని శ్రీ తాడేపల్లి తెలిపారు. మరిన్ని వివరాలకు: శ్రీ సుధాకర్ (90308 33930) సంప్రదించగలరు.

## నరసరావు పేట

స్థానిక బాబా సెంటర్‌లో అవతారుని జన్మదిన వేడుకలు 2013 అక్టోబరు 29 నుండి 2014 ఫిబ్రవరి 25 దాకా 120 రోజులు బాబా ప్రేమికుల ఇళ్ళలో నిర్వహిస్తున్నట్లు బాబా ప్రేమికులు శ్రీ అచ్యుతరావు ఒక ప్రకటనలో తెలిపారు. తన పుట్టిన రోజు సందర్భంగా 2013 నవంబరు 19న, తన మిత్రుడు మల్లాది రామారావు గారి కుమార్తె చి॥ షీల వివాహం సందర్భంగా 2013 నవంబరు 20న స్థానిక బాబా సెంటర్‌లో ప్రత్యేక సహవాస్ ప్రేమ విందు ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు.

# నరసరావుపేటలో ఏకాహం

నరసరావుపేటలో 2013 డిసెంబరు 1న ఉ. 7 నుండి సా. 7 గంటల దాకా 12 గంటల పాటు నిర్విఘ్నంగా అవతారుని ఏకనామం నిర్వహించినట్లు శ్రీ అచ్యుతరావు ఒక ప్రకటనలో తెలిపారు.

# చి॥ సందీప్ మెహెర్ వివాహం

శ్రీమతి సాయపనేని శైలజారాణి, శ్రీ సునిల్ కుమార్ గార్ల కుమారుడు, శ్రీ మహేశ్వరరావు హైదరాబాద్ గారి మనుమడైన చి॥ సందీప్ మెహెర్ వివాహం చి॥ల॥సౌ॥ విజయలక్ష్మితో 09.02.2014 రాత్రి గం. 9.21 ని.లకు ఫార్చ్యూన్ మురళి పార్కు హోటల్, మహాత్మాగాంధీ రోడ్, బెంజ్ సర్కిల్, విజయవాడలో జరుపుతున్నట్లు ఆహ్వానం పంపారు.

# పూతిక పేట

బాబా సత్యప్రేమ సందేశములు జన బాహుళ్యానికి అందించాలని విజయనగరం జిల్లా, పూతికపేట ప్రేమికులు స్థానిక పంచాయతీ పెద్దలు, అధికారుల సహకారంతో మనోహరమైన కొండపై మూడు ఎకరముల విశాల స్థలంలో అవతార్ మెహెర్‌బాబా సెంటర్ నిర్మాణం చేపట్టినట్లు శ్రీ సుంకర శ్రీను, అధ్యక్షులు (95025 79529) ఒక ప్రకటనలో తెలిపారు. స్థానికుల సహాయంతో చిన్న ఎత్తైన కొండపైన బోర్‌వెల్, రోడ్డు నిర్మాణం పూర్తి చేసినట్లు శాశ్వత భవన నిర్మాణపు పనులు చురుకుగా సాగుతున్నాయని ఆయన అన్నారు. ఈ నిర్మాణపు పనులు మరింత చురుకుగా సాగేందుకు బాబా ప్రేమికులందరూ తగిన విధంగా ఆర్థిక సహాయం అందించాలని శ్రీ తూలుగు రాము, కోశాధికారి (8374478182) కోరుతున్నారు.

## విరాళం

శ్రీ మహేశ్వరరావు గారి భార్య శ్రీమతి సావిత్రి మెహెర్‌బాబా మాస పత్రిక ప్రచురణ నిర్వహణకై రూ. 1116/- విరాళం అందజేశారు.

# నోరి వారింట ఏకాహం

శ్రీ నోరి మెహెర్‌చంద్ గారింట్లో అవతార్ మెహెర్‌బాబా ఏకాహం, బాబా సత్సంగ్, 2014 మార్చి 16, ఉదయం 5 నుండి సా. 6 దాకా ఏర్పాటు చేసినట్లు శ్రీ నోరి తెలిపారు.

ఉ. 5 గంటలకు నగర సంకీర్తన, ఏకాహం, అనంతరం సా. 6 నుండి అవతారుని సంకీర్తన, భజనలు, బాబా సందేశాలపై ప్రసంగం ఉంటుందని శ్రీ నోరి మెహెర్‌చంద్ తెలిపారు. మరిన్ని వివరాలకు (92465 86261) సంప్రదించగలరు.

# పావగడ బాబా సెంటర్ రజతోత్సవ వేడుకలు

పావగడ మెహెర్‌బాబా సెంటర్ రజతోత్సవ వేడుకలు 2014 జూన్ 3,4,5 తేదీలలో నిర్వహిస్తున్నట్లు ఆహ్వానం పంపారు. మరిన్ని వివరాలకు శ్రీ రఘుపతి, మెహెర్‌గడ (పావగడ)-09880462970 ఇ-మెయిల్: meherd.meher77@gmail.com సంప్రదించగలరు.

# ఏలూరు బాబా సెంటరు 61వ వార్షికోత్సవం





పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరు సెంటరు 61వ వార్షికోత్సవాన్ని **2013 డిశంబరు 25 ఉదయం 7 నుండి 1.30 దాకా** ఘనంగా జరుపుకున్నట్లు మా ప్రతినిధి శ్రీ సుధాకర్, మచిలీపట్నం ఒక ప్రకటనలో తెలిపారు.

# గుంటూరు బాబా సెంటర్ స్వర్ణోత్సవాలు

గుంటూరు బాబా సెంటర్ స్వర్ణోత్సవాలు **2014 మార్చి 1,2 తేదీలలో** మంగళగిరి రోడ్డులో గల అవతార్ మెహెర్‌బాబా మందిరంలో భారీ ఎత్తున ఏర్పాటుచేసినట్లు బాబా ప్రేమికులు శ్రీ కనకయ్య ఒక ప్రకటనలో తెలిపారు. వాలంటీర్లుగా పాల్గొనుగోరువారు అలాగే కార్యక్రమాలకు హాజరవ్వాలని కోరుకునేవారందరూ నిర్వాహకులకు సహకరించేలా తమ వివరాలను 2014 జనవరి 31 లోగా తెలియజేయవల్సిందిగా శ్రీ కనకయ్య (09885787719) కోరుతున్నారు.

# జొన్నాడ సెంటర్



బాబావారి 120వ జన్మదినం పురస్కరించుకొని తూర్పు గోదావరి జిల్లా జొన్నాడ గ్రామంలో ప్రతి నిత్యం అవతార్ మెహెర్‌బాబా సెంటర్‌లో అఖండ నామం నిర్వహిస్తున్నట్లు మెహెర్ బాబా సంచిక ద్వారా తెలుసుకుని ఆ కార్యక్రమంలో పాల్గొనేందుకు నేను వైజాగ్ నుండి వెళ్ళాను. అక్కడ సెంటర్‌లో ఎత్తైన మెహెర్‌బాబావారి దర్బార్ చిత్రంను ప్రార్థనామందిరంలో ఏర్పాటు చేశారు. మొదటిసారి మెహెర్‌బాద్‌లో పొందిన అనుభూతిని మళ్ళీ ఇక్కడ నేను పొందగలిగాననిపించింది. ఇక్కడ ప్రతిరోజూ ఉ. 4 గం.లకి సుప్రభాతంతో మొదలయి 5.15 ని.లకు బాబాకి హారతి, ఆ తరువాత 5.45 వరకు **ఓం. శ్రీం మెహెర్‌బాబాయనమః** అఖండ నామం 6 నుండి సా. 6 వరకు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రతిరోజూ అన్నప్రసాదం చేస్తున్నారు. ప్రతి శుక్రవారం నగర సంకీర్తన, ప్రతి సోమవారం పులిహూర పేకెట్లు కట్టి రాజమండ్రి దాకా తీసుకెళ్ళి బాబా ప్రసాదంగా అక్కడ పలువురు పేదలకు అందజేస్తున్నారు. అలాగే, బాగా బ్రతికి చితికిపోయి,బైటకి రాలేని వారికి ప్రతి నెలా 15 కిలోల బియ్యం రూ 300 నగదు అందజేస్తున్నారు. మెహెర్‌బాబాని భగవంతునిగా నమ్మి, బాబా నామం చేస్తూ బాబాలో ఐక్యమొందిన రామచంద్ర రెడ్డి గారు (బాబా తాతయ్య) జొన్నాడ ప్రజలందరికి చిరస్మరణీయులు. వారి జ్ఞాపకార్థం, వారి ఆశయాలను ఆచరణలో వారి కుమారులు అమలు చేస్తున్నారు. రెండు రోజులు ఉందామని వెళ్ళిన నేను, 10 రోజులు అక్కడే బాబా నామస్మరణతో సర్వం మరిచిపోయాను. **జొన్నాడ** వెళ్ళాలంటే రాజమండ్రి నుండి గాని, కాకినాడ మీదుగా రావులపాలెం దాకా టిక్కెట్టు తీసుకొని జొన్నాడ చేరుకోవచ్చు.

**– శ్రీమతి బళ్ళా శారదా రావు, విశాఖపట్నం**




## మెహెర్ ప్రభువుకు హృదయాంజలి-8

బాబావారి ప్రార్థనలు, సందేశములతో కూడిన మెహెర్ ప్రభువుకు హృదయాంజలి పేరిట ఒక క్రొత్త పుస్తకాన్ని ఇటీవల నిజామాబాద్ బాబా కేంద్రంలో జరిగిన స్వర్ణోత్సవాల సందర్భంగా విడుదల చేశారు. శ్రీమతి మోటమర్రి శివనాగేశ్వరి ప్రసాద్ బాబా సందేశాల ఆధారంగా రాసిన పలు కీర్తనలకు శ్రీమతి కె. వసంత స్వరకల్పన చేశారు. ఈ పుస్తకాలు అమ్ముడుపోగా వచ్చే నగదును జూబ్లీ సెంటర్ అభివృద్ధి నిధికి జమచేయనున్నామని శ్రీమతి శివనాగేశ్వరి (94404 -43049) తెలిపారు. తప్పక చదవండి.

# మెహెర్‌బాబా పత్రిక

మెహెర్‌బాబా పత్రికను ప్రతినెలా 19 లేదా 20 తేదీలలో సికింద్రాబాద్‌లో పోస్టు చేస్తున్నాం. 25వ తేదీ నాటికి పత్రిక మీ ముంగిట వుంటుంది. పత్రిక అందుటలో ఆలస్యమైతే శ్రీ వి. ఆర్. కె. శాస్త్రి, హైదరాబాద్ (98492-42284), లేదా శ్రీ కాగిత రామ్ (99481 28207) లను సంప్రదించగలరు. మీ వార్షిక, జీవిత సభ్యత్వం సక్రమంగా చెల్లించి సహకరించవల్సింది. గత రెండేళ్ళుగా వార్షిక సభ్యత్వం చెల్లించని సభ్యుల చిరునామాలను 2013 జనవరి నుండి తొలిగించవలెనని నిర్ణయించడమైంది. **అలాగే, జీవితసభ్యత్వంలో రూ 500 మాత్రమే చెల్లించినవారు కూడా 2013 జనవరి 31లోగా వారి బాకీ నగదు రూ 500 వెంటనే చెల్లించవలెనని మనవి. కానిపక్షంలో 2013 ఫిబ్రవరి నుండి వారు చెల్లించిన నగదును వార్షిక సభ్యత్వం క్రింద జమ చేసుకోవలెనని నిర్ణయించడమైంది. దయచేసి బాబా ప్రేమికులు సహకరించగలరు.** మీ సలహాలు, ఫిర్యాదులు, అమరతిధి ఎగ్జిబిషన్ స్టాలులో తెలియజేయగలరు.

మరిన్ని వివరాలకు మొబైల్ నంబరు 995955 3218 సంప్రదించగలరు. **- ఎడిటర్**



# అవతార్ మెహెర్‌బాబా జీవితచరిత్ర

ఆంగ్ల మూలం: - భావూ కల్చూరీ, లార్డ్ మెహెర్, వాల్యూం-3 (1925-29) - తెలుగుసేత: మల్లాది రామారావ్, న్యూఢిల్లీ

*(గత సంచిక తరువాయి)*

బాబావారి బస్సు గునా చేరిన సంగతి పాఠకులకి తెలుసు.
జూలై 18న ఆ ఊరు చేరారు.
మర్నాడు అంటే 19వ తేదీ ఉదయం, ధోతీవాలా అనే పెద్ద మనిషి బాబావారి దర్శనానికి వచ్చాడు. ప్రభూ మీ దర్శనంతో తరించాను అన్నాడు.
నాదొక చిన్న కోర్కె తీర్చురా అని ప్రాధేయపడ్డాడు.
ఏమి కావాలని బాబా అడిగారు.
ఏమీ లేదు బాబా చాలా చిన్న కోర్కె నాది అంటూ నీళ్ళు నమిలాడు.
ఫరవాలేదు, నీ మనస్సులో మాట చెప్పు అన్నారు బాబా.
వర్షం పడితే బాగుండును బాబా. కొంచెం వర్షం పడేలా కనికరించు,
అతగాడు అంటుండగానే కుంభవృష్టి మొదలైంది. ఆశ్చర్యపడటం అతనివంతయింది.
అతనే కాదు, అక్కడున్న అందరూ ఆశ్చర్యపడ్డారు.
ప్రభువు దయామయుడు అనుకొన్నారు కొందరు.
కాదు కోర్కెలు తీర్చే మహాప్రభువు అనుకొన్నారు ఇంకొందరు.
వీళ్ళ ధోరణి చూసి మండలివారు నవ్వుకొన్నారు.
పిలిచిన పలికే దైవమయినా, బాబావారు కోర్కెలు తీర్చే తండ్రి కాదని మండలివారికి తెలుసు. ఎన్ని పరీక్షలు పెడతాడో, ఎంతగా కనీళ్ళు తెప్పిస్తాడో బాబా, వాళ్ళకి తెలిసినట్లు మరెవ్వరికీ తెలీదు.
కోర్కెలు తీర్చడానికి నేను రాలేదు. వాంఛ ఫలసిద్ధి కావాలనుకొంటే మరి ఎవ్వరి దగ్గరకైనా వెళ్ళండని బాబావారు ఎన్నోసార్లు స్పష్టం చేశారు.
మరి ఈవాళ ధోతీవాలాగారి కోర్కెని నిముషాల్లో కాదు, సెకండ్లలో తీర్చారు.
ఎందుకనో మరి. ఏ కారణం లేకుండా బాబావారేపనినీ చేయరు.
బాబావారి మాటల ఆంతర్యం, బాబావారి చేతల విశిష్టత వెంటనే తెలియవు ఎవ్వరికీ.
అర్థాలకే అర్థాలు చెప్పే ప్రభువు ప్రతి చర్య ఏదో లోక కళ్యాణం కోసమే.
ఆ సంగతి కాలక్రమనే తెలుస్తుంది ఎప్పుడూ.

ఈవాళ కూడా ఏదో మహత్తర కార్యం కోసమే వర్షం తెప్పించి వుండాలి బాబావారు.
సరే మన మిత్రుడు ఆశ్చర్యంలో నించి తేరుకునేలోగా బాబావారు ఏమన్నారో
తెలుసా! నువ్వు వర్షపు నీళ్ళు కావాలన్నావ్. నేను వేశాను చూశావా అన్నారు.
నీరు, తీరు, మాటల పొందిక బాగుంది. ప్రాస కుదిరింది.
ఇంతకీ తీర్ అంటే ఏమిటో తెలుసా? తీర్ అంటే బాణం అని అర్ధం.
గునా నుంచి కొత్త మజిలీ శివపురి. ఉదయాన్నే బయలుదేరాలనుకున్నా వర్షం
పేరు చెప్పి కుదరలేదు. జల్లు కొంచెం తగ్గాక, పదకొండున్నరకి బస్సు కదిలింది.
శివపురి చేరేసరికి రెండు దాటింది. అక్కడ చూడదగ్గ ప్రాంతం శాక్య సాగర్.
చాలా పెద్ద చెరువు అది. అక్కడి ప్రకృతి చూస్తుంటే ఎంతసేపయినా
అలా చూస్తూ వుండిపోవాలనిపిస్తుంది.
రావ్‌సాహెబ్ దగ్గర బైనాక్యులర్ వుంది. సంచిలో నుంచి తీశాడు.
బైనాక్యులర్‌లో చూస్తే ఎంత దూరంగా వున్న దృశ్యమయినా దగ్గరగా కనిపిస్తుంది.
ఆ ఆనందంలో అతగాడు పరవశిస్తున్నాడు. బాబావారది గమనించారు.
వెంటనే బైనాక్యులర్‌ని లాక్కొన్నారు. పాద్రీకి ఇచ్చి, చెరువులోకి విసిరేయమన్నారు.
ప్రభువాజ్ఞని పాద్రీ శిరసావహించాడు. అయినా కోపం చల్లారినట్లు లేదు బాబావారికి.
రావ్‌సాహెబ్ చెంప చెళ్ళుమనిపించారు. ఎడాపెడా వాయించారు.
పాపం అతని మొహం ఎర్రగా కందిపోయింది. మనిషి భయంతో వణికిపోయాడు.
అయినా ప్రభువు కోపం చల్లారలేదు. "ఫో ఇక్కడి నుంచి! నీ మొహం చూపించకు"
అన్నారు. నాతో రావద్దు అన్నారు.
రావ్‌సాహెబ్‌కి దుఃఖం పొంగిపొర్లింది. నేనేమి తప్పుచేశాను బాబా,
ఇంత కఠిన శిక్ష వేస్తున్నావ్ అని బాధపడ్డాడు.
అతగాడి మూగవేదన వినిపించినట్లుంది. బాబావారు మరింత ఉద్రిక్తులయ్యారు.
తప్పు చేయలేదా నువ్వు అని నిలదీశారు. నేనేం చెప్పాను లంగోటి గట్టిగా బిగించు.
లంగోటి తాడు ఏమాత్రం జారినా ఊరుకొనేది లేదని ఎన్నిసార్లు హెచ్చరించాను,
అయినా పెడచెవిని పెట్టావు అన్నారు.
తప్పయింది బాబా అని అతగాడు అనుకొనేలోగానే అంతటి ఉగ్రమూర్తి ఫకాలున
నవ్వారు. చేసిన నిర్వాకం చాల్లే ఈవాళ్టికి. లంగోటి జారి క్రింద పడకుండా చూసుకో
అని బాబావారు అంటూంటే, అందరూ ఫక్కున నవ్వారు.
అంతటి దుఃఖంలోనూ రావ్‌సాహెబ్‌కి నవ్వు వచ్చింది.
'ఛీ పాడు! లంగోటి జారిపడితే సిగ్గు సిగ్గు' అనుకొన్నాడు.
వాతావరణం తేలికపడింది. అందరూ బస్సు ఎక్కారు. గ్వాలియర్ చేరే సరికి పావు
తక్కువ తొమ్మిది అయింది. పార్క్ హోటల్‌లో దిగారు ఆ రాత్రికి.

ఉదయాన్నే, అంటే జూలై 20వ తేదీన బాబావారు కాసేపు హోటలు బయట పచార్లు చేశారు. మండలివాళ్ళు ఒకరిద్దరు కూడా బాబావారితో పాటు నడిచారు. విష్ణు, గుస్తాద్ గారు ఏవో సామాన్లు కావాలి అంటూ మార్కెట్టుకి వెళ్ళారు. ఛగన్ వంట పనిలో పడ్డాడు. వంట రెడీ అయ్యేలోగా బాబావారు గ్వాలియర్ కోట చూసి వచ్చారు. భోజనం చేశాక, కాసేపు విశ్రాంతి తీసుకొన్నారు. రెండింటికి ఆగ్రాకు బయలుదేరారు. సాయంత్రానికి చేరారు అక్కడికి. ప్రయాణం పొడువునా ఛగన్ ఎవరితోనూ మాట్టాడ లేదు. ఏమయిందో తెలియదు కానీ మనిషి చాలా ముభావంగా కూర్చొన్నాడు.
ఆగ్రాలో బస – ఎంప్రెస్ హోటల్‌లో. కంటోన్మెంట్ అంటే, సైనికులు వుండే ప్రాంతంలో వుందీ హోటలు. ఆగ్రా ప్రాశస్త్యం తెలుసుగా పాఠకులకి.
మొగలు చక్రవర్తి షాజహాన్ కట్టించిన అద్భుత కళాఖండం – తాజమహాల్ వున్నది ఆగ్రాలోనే.
ఇక్కడ చూడదగ్గ ప్రదేశాలు బోల్డన్ని. మరి ఎందుకో ఏమో బాబావారు ఆగ్రాలో ఎక్కువసేపు వుండదలుచుకోలేదు. ఇక్కడ ఒక్కరోజే వుందామన్నారు.
మర్నాడు, జూలై 21వ తేదీ ఉదయం ఎనిమిదింటికి అందర్నీ పిలిచారు. ఏమిటో నేటి విశేషం అనుకొంటూ అందరూ బాబావారి సమక్షానికి వచ్చారు. అందరిముందూ బాబావారు ఛగన్‌ని నిలదీశారు.
నిన్న అంత ముభావంగా వున్నావేమని ప్రశ్నించారు.
కోపం తెచ్చుకోవటం, చిటపటలాడటం, మాటామంతీ లేకుండా ముభావంగా వుండటం మంచి పద్ధతి కాదని చివాట్లు పెట్టారు.
ప్రభువు సమక్షంలో ఇలా వుండకూడదు ఎప్పుడూ అన్నారు.
ప్రభువు దగ్గర వున్నంతసేపూ ప్రభువు ఇచ్ఛ, ప్రభువు మాట నీకు శిరోధార్యం కావాలి అన్నారు.
హాఫీజు సూక్తి చెప్పారు.
నా శత్రువులు బాగుండాలనుకొన్నా,
నా హితులు నశించాలన్న నా ఇష్టం ఎదురు చెప్పకూడదు ఎవరూ
నా ఇష్టానికి అని హాఫీజ్ అన్నారొకసారి.
కాబట్టి నేను ఫలానా పని చేయమని అంటే ఎందుకూ, ఏమిటి అని ప్రశ్నించకు. చిత్తం బాబా అను. ఏదో నోటి మాటగా కాదు. మనస్ఫూర్తిగా అనాలి. నేను చెప్పినట్లు చేయాలి. ఇదే నిజమైన సేవ నాకు. ఆధ్యాత్మిక మార్గంలో నువ్వు ముందుకి వెళ్ళినా వెళ్ళకపోయినా ఫరవాలేదు కానీ ప్రభువు మాటని శిరసావహిస్తే చాలు. తపస్సు చేసినా చేయకపోయినా ఫరవాలేదు.

ప్రభువు సేవ చేయగలిగితే చాలు.
ప్రభువ సేవలో పరిపూర్ణత సాధించగలిగితే మోక్షమార్గంలో పడతావు. భక్తికన్నా, యోగ సాధనాలకన్నా ప్రభుసేవ పరమోత్కృష్టమైంది అని బాబావారు శెలవిచ్చారు.
ఛగన్‌కి ఓ వరం ప్రసాదించారు.
వినయ విధేయతలతో నన్ను సేవిస్తే, నీకు ప్రతిఫలం దొరుకుతుందన్నారు.
అలనాడు రామదాసు యోగిని కళ్యాణ్ అన్న శిష్యుడు సేవించి తరించాడు.
గురువు తప్ప మరో ధ్యాసలేదు కళ్యాణ్‌కి.
గురువు ప్రతి మాటనీ వేదవాక్కులాగా స్వీకరించాడు.
అందువల్లనే తరించాడు.
కళ్యాణ్ బాటనే వెళ్ళు నువ్వుకూడా, తరిస్తావు అని ఛగన్‌కి బాబావారు హితవు చెప్పారు.
ఇంకోమాట అన్నారు. ఈమాట ఛగన్ కోసమే కాదు.
మండలివారందరి కోసం.
ఇంతకీ ఏమిటీ ఆ మాట? తమ మెప్పుకోసం మీరు తపించాలి అన్నారు.
ఇదే తమ యిచ్ఛ అన్నారు. నన్ను తృప్తిపరచడానికే మీరు శతధ ప్రయత్నించాలని నాకు వుంటుంది కానీ, మీలో ఎవరు గాడితప్పినా నాకు తలపోటుకి వస్తుందన్నారు.
ఇందువల్ల నన్ను కించపరచుకోవాలి.
లంగోటి తాడు జారినవాళ్ళని నా దారిలోకి తెచ్చుకోవాలి.
ఇందుకోసం నేనేమి చేయాలి. ప్రబుద్ధుడిని లాలించాలి. బుజ్జగించాలి.
గడ్డం పట్టుకొని ముద్దాడాలి, ఏమయిందిరా కన్నా నీకు అంటూ.
ఇలా ఎందుకు చేయాలి? దారి తప్పినవాడిని గాడిలోపడేయటానికి.
నేనిలాచేయడం మీకు మంచిదా అని అంటే,
మంచిది కాదు సరికదా మీకు యుక్తమైన పని కూడా కాదు.
మరి ఏం చేయాలి, మీరు ఏంచేయాలి అంటే,
నా మాట వినండి.
నేను చెప్పినట్లు చేయండి.
తలాయించకుండా చెప్పినట్లు నడుచుకోండి.
రోషమున్న మగధీరులమనుకోంటే మీసం వుంచుకోండి.
రోషం లేదు సరే,
ఏం చేస్తాం, మీసం పీకేయండి.
పిరికిపందలా మారండి అన్నారు. **సశేషం**

గత సంచిక తరువాయి

# మెహెరాబాద్‌లో దర్శనీయ స్థలాలు

## ఎగువ మెహెరాబాద్ - మెహెరాబాద్ కొండ

'నా విశ్వ కార్యక్రమంలో అధిక భాగం ఈ కొండపైనే జరిగింది. మెహెరాబాద్ ఒకరోజున అత్యుత్తమ తీర్థయాత్రా కేంద్రం అవుతుంది' - మెహెర్‌బాబా.

### బాబావారి సమాధి మందిరం

అతి పవిత్ర ప్రదేశం బాబావారి సమాధి మందిరం. బాబావారు స్వయంగా, 1927 మే నెలలో ఈ జాగాను ఎంపిక చేశారు. అప్పట్లో తడికలే గోడలుగా, రేకు కప్పు ఆచ్ఛాదనగా చిన్న కుటీరాన్ని కట్టించారు. జూన్ 30వ తేదీ (1927) రాత్రి బాబావారు ఈ కుటీరంలోనే గడిపారు. ఆ వేళే, కొత్త మెహెరాశ్రమాన్ని అరంగావ్ నుంచి కొండపైకి మార్చడం జరిగింది. అప్పట్లోనే బాబావారు కుటీరం వున్న చోట 80 అంగుళాల పొడవు, 40 అంగుళాల వెడల్పు, 70 అంగుళాల లోతుతో గొయ్యిని త్రవ్వించారు. గొయ్యిలోపల నాలుగువైపులా రాతి గోడ కట్టారు. లోపలికి దిగడానికి చిన్న మెట్లు కట్టారు. తూర్పు గోడ ప్రక్క పెద్ద అరుగు కట్టించారు. బాబావారు పిలిస్తే వచ్చిన స్కూలు పిల్లలు ఇక్కడే కూర్చొనేవారు. దర్శనార్థులు ఇక్కడే కూర్చొనేవారు.



కొన్నాళ్ళకి ఈ కుటీరాన్ని పడగొట్టి కొత్తది కట్టారు. చెక్కతో గోడలేసారు. రేకు కప్పు వేశారు. దక్షిణంలో తలుపు పెట్టించారు. కిటికీ పాత వేదికవైపు తెరుచుకొనేలాగా కిటికీ అమర్చారు. అంటే తూర్పుకి కిటికీ వచ్చింది. 1927 ఆగస్టు నెల నాటికి బాబావారి ఆవాసం ఈ కుటీరం. నవంబరు 10 నుంచి ఐదు నెలలపాటు ఏకాంతవాసం ఇక్కడే గడిపారు బాబావారు. ఏకాంతంతో పాటు ఉపవాస దీక్ష కూడా పట్టారు. గొయ్యి గదికి ఉత్తరం ప్రక్క తడికల గదులు నాల్గింటిని ఒక్క వరుసలో కట్టించారు. ఇవే సాధక ఆశ్రమం. 1927 డిసెంబరు నుంచి రెండున్నర నెలలపాటు ఏకాంతవాసం చేసింది ఇక్కడే. బాబావారు పిల్లలకి ఆధ్యాత్మిక మర్మాలు చెప్పడం, అనిర్వచనీయమైన అంతర్గత మార్పు వాళ్ళలో

రావడం అలా ప్రేమాశ్రమం వెలియడం జరిగింది. అప్పట్లోనే 1929లో ఆశ్రమం టోకా నుంచి మెహెరాబాద్‌కి తిరిగి వచ్చేశాక, గొయ్యి కుటీరానికి రాతిగోడలు కట్టారు. ఉత్తరాన, పశ్చిమాన కిటికీలు పెట్టారు. బాబావారికీ, బాబాతో ఆశ్రమం పిల్లలకీ చక్కటి ఫోటోలు తీశారు అప్పట్లో ఇక్కడే.

1938లో ఇప్పుడు మనం చూస్తున్న సమాధి గది నిర్మాణం జరిగింది. దిగువ మెహెరాబాద్ పోస్టాఫీసు ఇల్లు పడగొట్టి ఆ రాళ్ళను సమాధి నిర్మాణానికి వాడారు. సమాధి గోపురం నమూనా రూపొందించమని నౌరోజీ దాదా ఛాన్జీని బాబావారు ఆదేశించారు. నాలుగు ప్రపంచ మత చిహ్నాలను అంటే జొరాస్ట్రియన్ల అగ్నిశిఖ, హిందువుల దేవాలయం, క్రైస్తవుల శిలవ, ముస్లిమ్‌ల మసీదు గుర్తులు గోపురంపై వుండాలన్నారు. సమాధి లోపల గోడలపై బొమ్మలు వేయమని హెలెన్‌డామ్‌కి ఆ ఏడాదే చెప్పారు. స్విట్జర్లాండ్ కళాకారిణి ఆమె మెహెరాబాద్‌లో వుంటోంది అప్పట్లో. సమాధి మందిరంకు తూర్పున వున్న వేదికను పడగొట్టి మళ్ళీ కట్టించారు బాబా. సాధక ఆశ్రమానికి గుర్తుగా ఐదు ధ్యానం గదులను కట్టించారు. బాబా సమాధిపై వాడిన ఇటలీ క్వారీలలోని పాలరాయిని రానోగెలీ సెలక్టు చేసింది. ఆ రాతిని సమాధిపై 1971 ద్వితీయార్ధంలో పాడ్రీ పెట్టించారు. సమాధి ఉత్తరపు కిటికీకి స్టెయిన్ గ్లాస్‌పై రంగుల్లో బొమ్మలు వేయమని మెహెరా ఛార్లీ మోర్టన్‌ను కోరింది. ఆ బొమ్మలకి ఫోటోలు తానే ఇస్తానంది. ఇది 1930 దశకం సంగతి. చాలా శ్రమతో కూడిన పని కాబట్టి ముందు పెయింటింగ్ వేసి మెహెరా, మణి, రానో నచ్చితే అద్దంపై వేద్దామన్నది ఛార్లీ సంకల్పం. ఐతే మణి నిర్ణయానుసారం, 1991లో పెయింటింగ్‌నే సమాధిలో వుంచారు. సమాధి బయటి గోడలపై వేసిన రంగుల్ని మణి సెలక్టుచేశారు. 1990 – 92 మధ్య సమాధి మందిరాన్ని పూర్తిగా పునరుద్ధరించారు.

తమ సమక్షంలోనే తమ ఆధ్యక్షతన భావి సమాధిలో ప్రణమిల్లడం మీ అదృష్టం అని బాబావారు 1950 దశకపు సహవాస్ కార్యక్రమంలో పాల్గొన్నవారితో అన్నారు. 'భౌతిక శరీరాన్ని విడిచిన అరవై ఏళ్ళకి వేలాది మంది ఇక్కడికి వస్తారు. మెహెరాబాద్‌లో ధూళి ఏరుకొని దాచుకొంటారు. ఎందుకో తెలుసా? ఇది నేను నడిచిన ధూళి కాబట్టి అని బాబావారు 1955 నవంబరులో శెలవిచ్చారు. 1958 ఫిబ్రవరిలో ఇలా చెప్పారు: 'నేను దేహత్యాగం చేశాక, భౌతిక అవశేషాలు ఇక్కడ విశ్రాంతి పొందుతాయి. ఈ కొండ యావత్ విశ్వానికీ ప్రముఖ తీర్ధ స్థలమౌతుంది. నేటి విశిష్టత మీకు తెలీదు. 70 సంవత్సరాల తర్వాత ఈ స్థలం మహత్తర క్షేత్రంగా, తీర్ధ యాత్రా కేంద్రంగా భాసిల్లుతుంది. పెద్ద నగరమే వెలుస్తుంది ఇక్కడ. ఎవరి సమాధి దర్శనం కోసం ప్రపంచనలుమూలల నుంచి భగవత్ ప్రేమికులు, తత్వ వేత్తలు, భగవరాధకులు వచ్చి అంజలి ఘటిస్తారో, అట్టివాని సమక్షంలో ఈ స్థల విశిష్టతని మీరు వింటున్నారు. మీరు ఎంతో అదృష్టవంతులు అన్నారు బాబా.

1969 జనవరి 31వ తేదీన మెహెర్‌బాబా వారు తమ భౌతిక శరీరాన్ని మెహెరాజాద్‌లో వదిలి పెట్టారు. వారి శరీరాన్ని స్ట్రెచర్‌పై ఇక్కడకు తీసుకువచ్చారు. సమాధి, దానిలో వుంచవలసిన శవపేటిక సిద్ధం కావడానికి కొంత సమయం ఉండటంతో స్ట్రెచర్‌ని సమాధి దగ్గరి బాబా క్యాబిన్‌లో కాసేపు వుంచారు. ఈ క్యాబిన్‌లోనే ఆ స్ట్రెచర్ ఇప్పటికీ వుంది. బాబావారి శరీరాన్ని శవపేటిక మూతపై వుంచి సమాధిలోకి జాగ్రత్తగా దించారు. చుట్టూరా ఐసు ముద్దలు వుంచారు. పువ్వులతో అలంకరించారు. బాబావారు గతంలో సూచనప్రాయంగా చెప్పిన మేరకి ఏడురోజుల పాటు సమాధి మూయలేదు. ఇందువల్ల ప్రపంచం నలుమూలల నుంచీ వచ్చిన ప్రేమికులకి బాబా భౌతిక రూపాన్ని ఆఖరిసారి దర్శించే వీలుకలిగింది. ఫిబ్రవరి 7వ తేదీన శవపేటికను బాబావారి శరీరంపై వుంచి సమాధి చేశారు. అప్పటికి కూడా శరీరంలో ఏ మార్పూ కనబడలేదు.

## స్త్రీ మండలి సమాధులు:

బాబాకు సన్నిహితులైన స్త్రీ మండలి సమాధులు కొండపై వున్నాయి. ఇవి ఒక వరుసలో పశ్చిమంగా వున్నాయి. మొదటి సమాధి **రానో గెల్లీది.** ఆమె 1939లో మరణించింది. సమాధుల్లో ఎక్కువగా అస్తికలనే నిక్షిప్తంచేశారు. బాబా తల్లదండ్రులు – షిరీన్‌మాయి, షెరియార్జీల అంత్యకియలు పూనాలోని పార్శీవారి శాంతి స్థూపం వద్ద జరిగాయి. అయితే వారు నిత్యం వాడుకొన్న వస్తువులు కొన్నింటిని నిక్షిప్తంచేసి ఉభయుల సమాధులు కట్టారిక్కడ. బాబావారు ఇక్కడికి ఆఖరుసారిగా, 1962 ఆగస్టు 11న వచ్చారు. బాబావారి ఆధ్యాత్మిక మాత గుల్మాయి పార్థివ శరీరాన్ని ఖననం చేశారావేళ. బాబావారి పెంపుడు కుక్కల సమాధి, నెమలి సమాధి



మర్రిచెట్టు క్రింద కన్పిస్తాయి. 1959లో ట్రస్టును ఏర్పాటుచేసినప్పుడే, స్త్రీ మండలివారి సమాధులు తమ సమాధి మందిరానికి చెరోప్రక్కన వుండాలని బాబావారు నిర్దేశించారు. ఎవరి సమాధిని ఎక్కడ పెట్టాలో స్పష్టం చేశారు. బాబాకి అత్యంత ప్రీతిపాత్రురాలయిన మెహెరా పార్థివ శరీరం ఒక్కటే, బాబావారి పార్థివ శరీరంలాగ ఇక్కడ ఖననం చేయబడింది. ఈ గౌరవం మెహెరాకి మాత్రమే దక్కింది. మిగిలిన స్త్రీ మండలి వారి చితాభస్మం

నిక్షిప్తంచేస్తే చాలు అన్నారు. వీరంతా బాబాలో లీనం కావటానికి ముందుగానే సమాధి మందిరం తూర్పువైపున జాగా సిద్ధంచేశారు. అక్కడ వున్న అరుగునీ, ధ్యానం గదుల్నీ 1971లోనే పడగొట్టారు.

## బాబా క్యాబిన్:

1935వ సంవత్సరంలో ఏకాంతవాసం సంకల్పించిన బాబా, కొండపైన క్యాబిన్ కట్టమని పాద్రీని ఆదేశించారు. పురుషమండలికీ, స్త్రీ మండలికీ క్యాబిన్ చేరువుగా వుండాలని స్పష్టం చేశారు. అప్పట్లో స్త్రీ మండలిని బయటవారితో కలవనిచ్చేవారు కాదు. అందువల్ల, వారు ఏ ఇబ్బందీ లేకుండా క్యాబిన్‌వైపు రాగలగాలి. ఇందుకోసమనే, ఆశ్రమం గేటుకు కొంచెం దగ్గరగా, సమాధి అరుగుకి తూర్పువైపున వున్న జాగా చూపించి క్యాబిన్ కట్టమన్నారు. పురుగు, పుట్రా లోపలికి రాకూడదు. వర్షానికీ, ఈదురుగాలులకీ క్యాబిన్ తట్టుకొని నిలబడాలి. కాబట్టి తొందరపడకుండా నెమ్మదిగా శ్రద్ధగా రాళ్ళతో క్యాబిన్ కట్టమని బాబావారు పాద్రీకి చెప్పారు. అయితే బాబాకి ఏకాంత కార్యక్రమం వెంటనే ప్రారంభించాలనిపించింది. వెంటనే గడువు తగ్గించసాగారు. పోస్టాఫీసు ఇల్లు పడగొట్టగా వచ్చిన రాళ్ళతో కొత్త క్యాబిన్‌కి పునాది వేయగానే, ఇహ వారంరోజుల్లో నీపని పూర్తికావాలన్నారు. దీంతో పాద్రీ, అతని బృందం టేకుతో క్యాబిన్ కట్టి, రేకు తాపడం చేశారు. 1935 జూలై 15వ తేదీ సాయంత్రం బాబావారు క్యాబిన్‌లో అడుగుపెట్టారు. ఏకాంతవాస దీక్ష పట్టారు. బాబాకి టీ, భోజనం మెహెరా పంపేది. వాటిని వాలు బాబా గదికి తెచ్చేది. ఆమె కూడా స్త్రీ మండలి సభ్యురాలే. బాబావారు ఏకాంతవాసంలో ఎక్కడున్నా ఎవరూ తొంగి చూడకూడదు. అయితే ఒక రోజున, వాలు భోజనం తెచ్చేసరికి క్యాబిన్ తలుపు మూసివుంది. బహుశా గాలికి క్యాబిన్ తలుపు పడిందనుకుని, తలుపును త్రోసింది. ఎదురుగా బాబా కనిపించారు. ఆంతరంగిక కార్యక్రమంలో నిమగ్నమైన బాబావారు, చప్పుడుకి తలపైకెత్తారు. బాబా దృష్టి వాలుపై పడింది. అంతే భయంతో వణికిపోయింది. కళ్ళు రక్తపుగడ్డలయినాయి. నెప్పితో విలవిల



లాడింది. మూడు రోజులపాటు కళ్ళు మూసుకుపోయి గ్రుడ్డిదయింది. ఏకాంతవాసంలో బాబావారి పని యొక్క శక్తికి ఈ సంఘటన ఒక నిదర్శనం.

క్యాబిన్ కట్టినప్పటి నుంచీ అది బాబావారి గదే. కొండపైన వున్న ప్రతిసారీ, బాబావారు ఈ క్యాబిన్‌లోనే బస చేసేవారు. 1947 డిసెంబరు 31వ తేదీన మెహెరా 41వ పుట్టినరోజు వేడుకలు మెహెరాబాద్‌లో జరిగాక ఈ క్యాబిన్‌లోనే పడుకొన్నారు. అదే ఈ క్యాబిన్‌లో బాబావారి ఆఖరి నిద్ర.

## ఆస్పత్రి భవనం, బోనుగది:

1927–28 సంవత్సరాల మధ్య మెహెరాశ్రమ పిల్లల పడక గది వున్న చోటుకి దగ్గరగా కట్టారీ ఈ ఇల్లును. అది 1938వ సంవత్సరం నాటి మాట. మొదటి పోస్టాఫీసు బిల్డింగ్ రాళ్ళనే దీని పునాదికి వాడారు. మొదటి ఏడు ఇక్కడ స్థానిక మహిళలకోసం ప్రసూతి ఆస్పత్రి నడిపారు. నాదినే టాలిస్టాయ్ ఈ ఆస్పత్రికి పెద్ద దిక్కు. ఎంతోమంది ఇక్కడ పురుడు పోసుకొన్నారు. రోజూ బాబావారు కొత్త శిశువుల ఊయలను వూపేవారు. మెహెర్‌బాబా జర్నల్ పనిని 1939లో ఎలిజెబెత్ పాటర్సన్, నోరీనా మాచబెల్లి బోను ప్రక్కగది నుంచి నిర్వహించారు. 1940 ఏప్రిల్‌లో బెంగుళూరు మస్తు ఆశ్రమాన్ని మూసివేశాక, అక్కడి కొంతమంది మస్తులను ఇక్కడికి తెచ్చారు. తడికల గదిలో వుంచారు. ఆ తడికల గది ఎగువ మెహెరాబాద్‌లో మస్తు ఆశ్రమ కేంద్రమయింది. బెంగుళూరు ఆశ్రమంలోలాగ, ఇక్కడ కూడా బాబావారు టీ, బీడీకొట్టు ఏర్పాటుచేశారు.

రెండో ప్రపంచ యుద్ధం వేడి పెరుగుతుంటే, జూన్ ఒకటి నుంచి బాబావారు మస్తులతో ముఖ్యంగా చట్టిబాబాతో ఏకాంతవాసం చేశారు. దక్షిణ భారతం నుంచి వచ్చిన చట్టి మస్తు నమ్మకస్తుడు. శాంతమూర్తి. 1940 జూలైలో పులిలా భయంకరంగా వుండే కరీంబాబా వచ్చాడు. ఈ కలకత్తావాసి కోసం, పాద్రికి చెప్పి బాబావారు కటకటాల గది కట్టించారు. ఇక్కడ ఏకాంతంలో వున్న బాబాకి సేవచేసే బాధ్యత కృష్ణనాయర్, విష్ణులది. మెహెరా, మణిలని కూడా బోను గది దక్షిణ కిటికీ దగ్గరకు రానిచ్చారు. అది కేవలం అభివాదం చేయడానికే. ఆ కిటికీలో చిన్న కన్నం వుంది. ఈ ఏర్పాటు చేయించింది పాద్రీ. 1941వ సంవత్సరం ఆగస్టు నెల నుంచి బాబావారు చేపడుతున్న ప్రత్యేక ఏకాంతపు ఏర్పాట్లలో భాగంగా పాద్రీ చేశాడీపని. ఉత్తరాలు వగైరా ఇవ్వడానికి ఈ కన్నం ఉపయోగపడింది. ఇది ఇప్పటికీ వుంది. చూడవచ్చు. ఇక్కడ ఏకాంతవాసంలో వున్న బాబాకి సేవ, కాపలా పని కృష్ణనాయర్‌ది. అతను ఎక్కువగా గేటు దగ్గరే వుండేవాడు. గేటుపైన వున్న ఓ గంట, లోపల ఇంకో గంట వుండేది. లోపలికి రావాలంటే అతను గంట కొట్టాలి. అనుమతి ఇస్తూ బాబా గంట మ్రోగిస్తేనే లోపలికి వెళ్ళవచ్చు. కృష్ణ లోపలికి వస్తే, అతనికి కనబడకుండా ఓమూల ఒదిగి వుండేవారు బాబా. ఓరోజు కృష్ణ గంట విన్నాడు. కానీ బాబావారు గంట కొట్టలేదు. అందుకనే గేటుదాటి లోపలికి అడుగుపెట్టగానే కృష్ణకు 100 సూర్యుల కాంతిని

విరజిమ్మే బాబా వదనం కన్పించింది. స్పృహకోల్పోతుంటే అతని ఎడమచేతిని బాబావారు పట్టుకొని కండ గట్టిగా పీకేశారు. కృష్ణ ప్రాణం నిలిచింది. బాబా పీకినచోట పద్దగుర్తు జీవితాంతం చెరగలేదు. ఏకాంతవాసంలో బాబాచేసే పని యొక్క శక్తికి ఈ సంఘటన నిదర్శనం. 1940 సెప్టెంబరులో కొండపైన కొత్త మరుగు దొడ్లు, స్నానాల గదీ కట్టారు. తడికల గోడ, ఇనుప రేకులతో మరుగు ఏర్పాటుచేశారు. ఇది ఇప్పటికీ వుంది. మతి భ్రమించినవారి ఆశ్రమాన్ని ఇక్కడికి మార్చారు. కానీ కొద్దిరోజులకే దాన్ని మూసేశారు.

దరిమిలా రోజుల్లో ఈ ఇల్లు మండలి నివాసంగా మారింది. నవజీవనం తొలిరోజుల్లో కైకోబాద్ దస్తూర్ గారి భార్య పిల్లలు ఇక్కడే వున్నారు. బాబా శరీరం విడిచాక, కైకోబాద్ ఇందులోకి మారాడు. ఏడేళ్ళ తర్వాత కన్నుమూశాడు.

## మెహెర్ రిట్రీట్:

ఈ భవనం క్రింది భాగం బ్రిటీషు సేనల నీళ్ళ ట్యాంకి, అందులో రెండు పెద్ద గదులు వుండేవి. 1920 దశకంలో బాబావారు ఇక్కడ వున్నారు. 1926లో బాబావారు ఏకాంతవాసం పశ్చిమ గదిలో చేశారు. తమ రహస్య గ్రంధ రచన కొంత చేశారు. అప్పట్లో 'ట్యాంకి'కి ద్వారాలు, తలుపులు లేవు. అందుకని బాబా గోడ అవలీలగా ఎక్కి, నిచ్చెనతో ట్యాంకిలోకి దిగేవారు. ఏదో ఒక గదిలో వుండేవారు. దిగువ మెహెరాబాద్‌లో పోస్టాఫీసు కాంపౌండ్‌లో నిలబడి మెహెరా, ఇతర స్త్రీ మండలి చూస్తుంటే ట్యాంకిపైకి ఎక్కి, వాళ్ళకి చెయి వూపుతూ క్రిందికి తూర్పు గదిలోకి దిగేవారు. రెండు ట్యాంకి గదులలోకి సులువుగా వెళ్ళడానికని బాబావారు 1927 జూన్ నెల మధ్యలో తలుపులు పెట్టించారు. నానాటికీ పెరిగి పెద్దదవుతున్న మెహెరాశ్రమాన్ని కొండపైకి మార్చారు. హజరత్ బాబాజాన్ పాఠశాలలో



లాగా, మెహెరాశ్రమం ఉచిత భోజన సదుపాయం వున్న బాలుర పాఠశాల. అయితే ఇక్కడ ఆధ్యాత్మిక శిక్షణ ఎక్కువ. మెహెరాశ్రమం బాలురు రెండు ట్యాంకి గదుల్లో పడుకొనేవారు. పశ్చిమ గదిని పగలు సమావేశ మందిరంగా వాడేవారు. మెహెరాశ్రమం సూపరింటెండెంట్ బువా సాహెబ్‌కి ఆఫీసు, ఇల్లు అంతా దక్షిణ గది.

1930 జూన్ నెలలో బాబావారు, కొంతమంది మండలివారు ఈ ఇంటిలోని మూడు గదుల్లోనూ ఏకాంతవాసం చేశారు. బాబావారికి అతి సన్నిహితులైన మెహెరా, మణి, ఖోర్షెద్, నాజా, సూనామాసి, వాలు ఇక్కడి తూర్పు గదిలో నవంబరు 1933లో కఠిన ఏకాంతవాసం చేశారు. విధేయత, పరిశుద్ధత, పేదరికానికి వాళ్ళ జీవితం అద్దం పట్టింది. తూర్పుగది నుంచి వంటగదికి వెళ్ళటానికి వరండా మీదుగా వెళ్ళాలి. వీరు వస్తూ పోతుంటే, వీరు ఎవరికీ కనబడకుండా వరండాకి తడికలు కట్టారు. పశ్చిమవైపు గది నుంచి కూడా వంట గదివైపు దారి వుంది. ఆ దారిని కూడా తడికలతో మూసేశారు. ఇందువల్ల స్త్రీలు స్వేచ్ఛగా తిరగడానికీ, వ్యాయామం చేయడానికి వీలయింది. చాలా కాలంగా మెహెరాకి పురుష స్పర్శ నిషేధం, ఇప్పుడు కొత్త నియమం మెహెరా పురుషుల మాట వినరాదు. మగవాళ్ళ పేరు కూడా చెవిని పడకూడదు. అందువల్ల కొండపై పనిచేయడానికి వచ్చిన వాడు మాట్లాడుతుంటే, అతగాడి మాటలు వినబడకుండా మణి సితార తారాస్థాయిలో వాయించేది. అదీ గంటల తరబడి.

1938లో మెహెర్ రిట్రీట్‌కి పై అంతస్థు వేశారు. బాబావారి ఆశ్రమంలో చేరుతున్న పాశ్చాత్య స్త్రీల నివాసం కోసం ఈ గదులను కట్టారు. ఈ నిర్మాణం బాధ్యత పెండూది. త్వరగా కట్టమన్నారు. వ్యవధి ఎక్కువ ఇవ్వలేదు. అయినా, పెండూ బృందం బాబా పెట్టిన 1938 ఆగస్టు 25వ తేదీ గడువుకి పై అంతస్థుని రెడీ చేశారు. బాబా సంతోషించారు. పెండూ, కాలేమామ, నౌరోజీలను అభినందించారు. పూలమాలతో సత్కరించారు. ఈ పూలహారం బాబాని సంతోషపెట్టినందుకు తీపిగుర్తు అంటూ పెండూ, ఎన్నో ఏళ్ళు దాచుకొన్నాడు. ఈ భవనంపై కనిపిస్తున్న గోపురం కూడా అలనాటిదే. దూరం నుంచి కూడా విలక్షణంగా కనిపించేలా గోపుర నిర్మాణం జరిగింది. గోపురంలో గది బాబావారి ఏకాంతవాసం కోసమే. అయినా గాలి బాగా గట్టిగా వీస్తుండటంతో, బాబావారిక్కడ కేవలం ఒక్కరోజే వున్నారు. ప్రాక్పశ్చిమ స్త్రీ శిష్యులు ఈ ఇంటిలో బసచేశారు. ఎవరెవరు కలిసివుండాలో బాబావారే నిర్దేశించారు. నవజీవనంలో అడుగుపెట్టే ముందు, బాబావారు స్త్రీ మండలిని చాలాసార్లు తూర్పు గదిలోనే కలిశారు. దరిమిలా ఆశ్రమాన్ని మూసేశాక కైకోబాద్ కుటుంబం, మన్సారీ మాత్రమే కొండపైన మిగిలారు. నమ్మశక్యంకాని త్రిసప్తాహం కోసం (1954) వచ్చిన పాశ్చాత్యులు, పురుషులకు పై అంతస్థునీ, పశ్చిమగదినీ కేటాయించారు. పశ్చిమగది ఇప్పుడు మ్యూజియం అయింది. దక్షిణగది గ్రంధాలయమైంది. పై అంతస్థుని స్టడీహాలు చేశారు.

## వంట గది:

ఈ ఇంటి నిర్మాణం చాలా వరకూ 1933లోనే జరిగింది. పునాదికి పోస్టాఫీసు భవనపు రాళ్ళు కొన్ని వాడారు. మెహెరాశ్రమ భోజనాల గది వుండే చోటుకి కొంచెం అటూఇటుగా ఈ ఇల్లు కట్టబడింది. పెద్దగదిని స్త్రీ ఆశ్రమపు ప్రధాన వంటశాలగా కొంతకాలం వాడారు. పశ్చిమంలో చిన్న గది వుంది. 1935లో కొండపై తమ క్యాబిన్ రెడీ అయ్యేవరకు ఈ చిన్న గదిలోనే బాబా విశ్రాంతి తీసుకొనేవారు. దరిమిలా ఈ గది స్త్రీమండలి స్నానాలగది అయింది. బాబా, మెహెరాల స్నానపు గదులని తూర్పు ప్రక్క 1938లో కట్టారు. అప్పటినుంచీ కొత్త రివాజు వచ్చింది. ప్రధాన వంటశాలకి తూర్పున వున్న చిన్న గదిలో, మెహెరా వండిన అన్నాన్ని బాబావారికి వడ్డించేవారు. 1950 నుంచి 1997లో చనిపోయే వరకూ మన్సారీ ఇక్కడే రెండు గదుల్లో వుండేది. మరోగదిలో సామాన్లు పెట్టుకొనేది. 1970 ప్రథమార్ధంలో కేర్‌టేకర్ గదిని పశ్చిమవైపున, ఇంకో చిన్నగదిని ఆగ్నేయంలోనూ కట్టారు.

## టిన్‌షెడ్ – స్త్రీల కాంపౌండ్:

టిన్‌షెడ్ వున్న చోట 1938కి పూర్వం బ్యాట్‌మెంటన్ కోర్టు వుండేది. తూర్పు దేశాల స్త్రీలతో బాబావారు బ్యాట్‌మెంటన్ ఆడేవారు. మహిళా ఆశ్రమం విస్తరిస్తున్నప్పుడు ఈ టిన్‌షెడ్ నిర్మాణం 1938లో జరిగింది. స్త్రీల భోజనాలగదిగా ఈ షెడ్ అక్కరకు వచ్చింది. ఇక్కడ వున్న తిరగలి ఆలనాటి ఆశ్రమం రోజులనాటిదే. సాయంకాలం తరచు బాబా ఇక్కడ గద్దె (పడక కుర్చీ వంటిది) పై కూర్చొనేవారు. స్త్రీ మండలితో ఇష్టాగోష్ఠి చేసేవారు.

రాతి ప్రహరీగోడ నిర్మాణం 1980 దశకంలో జరిగింది. కానీ 1938 నాటికీ ఇక్కడ ప్రహరీగోడ వుంది. ఉత్తరంవైపున ఇప్పటికీ పాతగోడ వుంది. ఆ పాతగోడపైన ఐదు వరుసల్లో ఇనుప ముళ్ళ తీగ కంచె వేశారు. రెండో ప్రపంచ యుద్ధం జరుగుతుంటే, బాబావారు ఇంకో ముళ్ళతీగ వేయమనేవారు. అలా మూడుసార్లు చేశారు. ఇలా మొత్తం ఎనిమిది వరుసల్లో ఇనుప ముళ్ళతీగ కంచె ఏర్పడింది. ఆశ్రమం రోజుల్లో రకరకాల జంతువులు, పక్షులు వుండేవి. కాంపౌండ్ లోపలి నైఋతి మూల జంతువుల్ని కట్టేసేవారు. పక్షుల ఆవాసం కూడా అక్కడే. వాయువ్యంలో ఎలిజబెత్ కారు షెడ్ వుండేది. దరిమిలా అది గుర్రపుశాల అయింది. ఉత్తరం గోడ బయట కోళ్ళ గూడు వుండేది. ఆ ప్రక్కనే మెహెరా గుర్రపు స్వారీ కోసం పశ్చిక మైదానం వేయించారు.

## కాపలా గది – కాలిబాట:

ఓ చిన్న కాపలా గది, నీళ్ళ ట్యాంకీకి అరుగు 1933లో కట్టారు. వాటిస్థానే కొత్త కాపలా గదిని 1938లో రిట్రీట్ లోపలే కట్టారు. దక్షిణం వైపుకి వుంది. ఇదీ మరీ పెద్దది

కాదు. చాలా ఏళ్ళు సునామాసి ఇక్కడి నుంచే పగటిపూట కాపలా కాసేది. అప్పట్లో చుట్టుప్రక్కల చెట్లు లేవు. అందువల్ల దిగువ మెహెరాబాద్ నుంచి వస్తున్న బాబా రైలు పట్టాలు దాటుతుంటే సునామాసికి కనిపించేవారు. వెంటనే ఎదురువెళ్ళేది. కొండపైకి సాదరంగా తీసుకువచ్చేది.

బాబా వెంట కొండ ఎక్కడం, కొండ దిగగలగటం నా విధి, అదృష్టం అనేది.

రాత్రిళ్ళు కాపలాకి వాచ్‌మన్ వుండేవాడు.

1927లోనూ, 1928లోనూ ప్రత్యేక సందర్భాల్లో మెహెరాశ్రమం పిల్లలు, బాబావారిని లాగుడు రిక్షాలో కూర్చోపెట్టి కొండపైకి, క్రిందకీ త్రిప్పేవారు. ఈ లాగుడు రిక్షా ఇప్పుడు మ్యూజియంలో వుంది. జన్మదిన వేడుకలు మెహెరాబాద్‌లో జరుపుకున్న ప్రతిసారీ జయజయ ధ్వానాల మధ్య బాబావారు కొండ ఎక్కేవారు. ముందు సన్నాయి మేళం నడిచేది. సభలు, సమావేశాలు, సహవాస కార్యక్రమాలప్పుడు కూడా శిష్య సమేతంగా బాబావారు కొండ ఎక్కేవారు ఈ కాలిబాటనే. శిష్యులతో తిరిగి ఈ కాలిదారినే క్రిందకు వచ్చేవారు.

కాలిబాటకి రెండువైపులా మర్రి, వేపచెట్లని స్త్రీమండలి సభ్యురాలు వాలు నాటించింది. కొండపైకి, క్రిందకూ వస్తూ వెడ్తుంటే బాబావారికి ఎండ తగలకూడదన్నది ఆమె ఆరాటం.

ఆశ్రమంలో కడిగి పారబోసిన నీళ్ళు, ఉతికిన నీళ్ళ స్వయంగా తెచ్చి పాదుల్లో పోసేది. అలా శ్రద్ధగా చెట్లని పెంచి పెద్ద చేసింది. 1970 దశకంలో మెహెరా కొన్ని చిన్న చెట్లు వేయించింది. సమాధి దర్శనార్థులకి కాలిబాటన నీడ అవసరం కదా అనేది మెహెరా.

**పంచవటి గుహ:** మెహెరాబాద్ కొండ తూర్పు భాగాన 1930లో మండలి వారిచేత బాబా గుహ త్రవ్వించారు. దానికి పంచవటి గుహ అని పేరు పెట్టారు.

ఆ ఏడాది (1930) నవంబరు 15న అక్కడ ఏకాంతవాసం మొదలుపెట్టారు. సాధారణంగా ఎవరినీ కలవకపోయినా, బ్రిటీషు పత్రికా రచయిత పాల్ బ్రన్టన్‌కి ఇంటర్వ్యూ ఇచ్చారు. రాబోయే ప్రళయం, వినాశనం గురించి జోస్యం చెప్పారు.

మెహెర్‌బాబా యుగావతారుడినని పశ్చిమదేశాల్లో ప్రచారం చేయమన్నారు.

అవాక్కయ్యాడు బ్రన్టన్ దొర గారు.

స్వదేశం వెళ్ళాక 'ఇన్‌సెర్చ్ ఆఫ్ సీక్రెట్ ఇండియా' అన్న పుస్తకంలో బాబా కూడా దేముడా అంటూ వేళాకోళం చేశాడు.

మనసా వాచా భగవదన్వేషణ చేస్తున్న సాధకులు కొందరు బాబావారి పేరు విన్నది ఈ పుస్తకం వల్లనే. 'భవిష్యత్తులో మెహెరాబాద్ జెరూసలెంలా విలసిల్లుతుంది.

**సమాప్తం**

# జమా ఖర్చులు

**2012-జనవరి నుండి 2012 డిశంబరు వరకూ**

| జమలు | | | ఖర్చులు | |
|---|---|---|---|---|
| 1. | వార్షిక సభ్యత్వం | 25,295.00 | ప్రింటింగ్ చార్జి | 82,240.00 |
| 2. | డొనేషన్లు | 13,948.00 | డి.టి.పి చార్జి | 4,500.00 |
| | | ---------------- | పోస్టల్ స్టాంపులు | 4,000.00 |
| | | 39,243.00 | మెహెరాబాద్ స్టాలు | 1000.00 |
| 3. | లోటు | 60,897.00 | కవర్లు, స్క్రీన్ ప్రింట్ | 8,400.00 |
| | | ------------- | మొత్తం ఖర్చు | **1,00,140.00** |
| | | **60,897.00** | | |
| **లోటు** | | **60,897.00** | | |

**జమలు:** వార్షిక సభ్యత్వం రూపేణా కొందరు రు. 100/- మరికొందరు రు.200/- చొప్పున పంపినారు. 2013 జనవరి నుండి డిశంబరు 2013 దాకా మొత్తం వార్షిక సభ్యత్వం పంపినవారు 251 మంది. ముట్టిన నగదు రు.25,295/-. కాగా, మాస పత్రికకు డొనేషన్లు రూపంలో రు.13,948/-పంపినారు. జమలు మొత్తం రూ.39,243/- అందినాయి. భారీ లోటు బడ్జెట్- రూ. **60,897**/-.

**ఖర్చు:** 2013 జనవరి నుండి ఆగస్టు దాకా 1350 కాపీలు చొప్పున ప్రచురించడమైంది. 2013 సెప్టెంబరులో 1300 కాపీలు, అక్టోబరు, నవంబరులలో 1200 చొప్పున, డిశంబరు నెలలే 1250 ప్రతులు ప్రచురించడమైంది. వార్షిక సభ్యత్వం చెల్లించని వారి అడ్రస్సులు తొలిగింపులు ద్వారా ప్రతుల సంఖ్య కుదింపు జరిగింది. కాగా, ప్రతి 1000 సంచికలకు రూ 4800/- రూపాయలు చొప్పున ప్రతి అదనపు 100 పత్రులకు రు.480/-, 50 ప్రతులకు రూ.240/- చొప్పున చెల్లించడమైంది. కాగా, ఫిబ్రవరి 13 కొవ్వూరు పసిడి పండుగల సందర్భంగా ప్రత్యేక సంచిక 62 పేజీలలో మల్టీ కలర్ అట్టతో ప్రచురించినందుకు గాను రూ. 14,000/- వేలు 1350 ప్రతులకు గాను చెల్లించడమైంది. ఆ మాదిరిగా 2013 జనవరి నుండి డిశంబరు దాకా మొత్తం ప్రింటింగ్ చార్జీలకై రు.82,240/- చెల్లించడమైంది. హైదరాబాద్‌లోని శ్రీ సాయి శ్రీనివాస ప్రింటర్స్, ఖైరతాబాద్ ఫోన్:040-23392566 వారు పత్రిక ప్రారంభపు సంచిక నుండి నేటి వరకూ ప్రతినెలా ప్రింట్‌చేసి అందజేస్తున్నారు. ఈ ఏడాది పత్రికలను పోస్టుచేసేందుకు గాను 25 వేల కవర్లు, వాటిపై అడ్రస్సు ఇతరత్రా స్క్రీన్ ప్రింట్ కోసం రూ. 8,400/-, పోస్టలు స్టాంపులు, ఖర్చులు ఇతరత్రా పైన పేర్కొన్నట్లు మొత్తం **ఖర్చు** రూ.**1,00,140**/-, జమలు రూ.39,243/-. కాగా, ఈ ఏడాది భారీ లోటుగా రూ.**60,897**/- నమోదయింది.

## జీవిత సభ్యులు

**1**.)2013 ఏడాది మొత్తం జీవిత సభ్యత్వం రు. 1000/-చొప్పున 49 మంది రూ.4900/- రూ.500/-, రూ. 250/-,రూ. 200/-, చొప్పున 39 మంది రూ. 18,550/- జీవిత సభ్యత్వం చెల్లించారు.

మొత్తం రూ. 67,550/- జీవిత సభ్యత్వం ఖాతాకు జమ అయ్యింది.

**2**.) జీవిత సభ్యులు చెల్లించిన మొత్తాన్ని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, **(ఐ.ఓ.బి)** సైనిక్‌పురి బ్రాంచ్, సికింద్రాబాద్‌లో ఫ్లెక్సీ-ఫిక్స్‌డ్ డిపాజిట్ పథకం అకౌంట్ నెం. **SB-SLVRI ACCOUNT NUMBER : 29152** జమచేయడమైంది.

**3.)** 2011 వరకు గల డిపాజిట్‌లు అన్నీ మెచ్యూర్ కావడంతో ఆ నగదును మంత్లీ ఇన్‌కం స్కీమ్ - పోస్టాఫీసుల యందు జమ చేయడమైంది. నెల నెలా వచ్చే వడ్డీని పోస్టాఫీస్ రికరింగ్ డిపాజిట్ నందు జమ చేయబడుతోంది. జీవిత సభ్యత్వం నగదుపై వచ్చే వడ్డీని నేటివరకూ పత్రికా ఖర్చులలో వినియోగించలేదని మనవి. జీవిత సభ్యత్వం చెల్లించిన వారి వివరాలన్నీ ఎప్పటికప్పుడు ప్రతి నెలా మెహెర్‌బాబా సంచికలో ప్రచురిస్తూ సంబంధితులందరికీ తగిన సమాచారం అందజేస్తున్నాము.

పోస్టాఫీస్ ఖాతాలలో జమ అయిన నగదు- వడ్డీలతో కల్పి వివరాలను పేజి 35లో చూడగలరు.

**ముఖ్య విషయాలు**

ప్రతి ఏడాది కూడా సుమారు 50 వేల రూపాయల పైబడి లోటు వస్తోంది.

ఈ లోటు బడ్జెట్‌ను **శ్రీ దశిక మెహెర్‌బాబా, యుఎస్ఏ అందజేస్తున్నారు.**

**ఏది ఏమైనా ప్రతి ఏడాది ఈ మాదిరి లోటు బడ్జెట్ రావడం** మంచి సాంప్రదాయం కాదని పెద్దలందరూ ఒప్పుకుంటారు.

మెహెర్‌బాబా పత్రికా నిర్వహణకు సుమారు రూ. 20 లక్షలు డిపాజిట్లు అవసరమౌతాయి. ఆ లక్ష్యం చేరేవరకూ జీవిత సభ్యుల చెల్లింపులపై వచ్చే వడ్డీని అసలుకే జమ చేస్తూండాలని, మా ఆశయం. త్వరలో ఆ లక్ష్యం చేరగలమని పాఠకులందరి పక్షాన ఆశిస్తున్నాం. ప్రస్తుతం జీవిత సభ్యత్వం రూ. 1000 చెల్లిస్తున్నారు. ఐతే, కొందరు బాబా ప్రేమికులు ఈ మొత్తాన్ని రూ.2000 గా పెంచవల్సిందిగా సూచిస్తున్నారు. కానీ, అధికశాతం బాబా ప్రేమికులకు భారం కాకూడదని భావిస్తున్నాం.

ఆ మేరకు డొనేషన్‌గా కనీసం పదివేల రూపాయలు ఆపై డొనేషన్ ఇవ్వగల్గిన వారికి స్వాగతం పలకాలని ప్రతిపాదించుతున్నాం.

మీ సూచనలు, సలహాలు ఆశిస్తూ..

జైబాబా..

## పోస్టాఫీస్ ఖాతాలలో జమ అయిన నగదు- వడ్డీలతో కల్పి వివరాలు (12.01.2012 నుండి 13.1.2013 దాకా)

| Sl. No | Life Membership deposits | Sl. No | Life Membership deposits |
|---|---|---|---|
| 01 | **MIS- BOLARUM**<br>Jt. A/C No: 8021331;<br>Rs. 6,48,000/-<br>29-02-2012 TO 29.2.2017<br>Interest P.M.<br>RS. 4,470/- | 1A | RD- BOLARUM RS. 4,470/-<br>Jt. A/C No: 17702<br>03-04-2012 To 03-04-2017<br>**Accrued int. as on Dec.'13: Rs. 93,870/-** |
| 02 | MIS- BOLARUM<br>Jt. A/C No: 8062844;<br>Rs. 3,66,000/-<br>04-12-2009 To 04-12-2015<br>Interest P.M. Rs. 2440/- | 2B | RD- BOLARUM<br>Jt.A/C No: 16904<br>18-01-2010 To 18-01-2015<br>**Accrued int. as on Dec.'13:Rs. 1,17,120/-** |
| | **DONATIONS** | | **DONATIONS** |
| 03 | **Ms. SARADA** has donated a total of Rs.60,000/- for Life Membership A/C. Deposited in MIS-Post Off. Tirumalghery<br>Jt. A/C No: 8020248<br>17.3.2011 To 17.3.2017<br>Interest P.M. 400/- | 3C | RD- - Tirumalghery<br>Jt. A/C No: 70139<br>**25-4-2011To 25-4-2017**<br>Rs. 400/- PM<br>**Accrued int. as on Dec.'13:** Rs.13,200/- |
| 04 | **Ms. SARADA** has donated Rs.30, 000/-. For Life Membership account.<br>It was deposited in KARUR VYSYA BANK,<br>A/C No. 1410.501.93705/1<br>Sec'bad Br. The details are:<br>5.9.2012 To 5.9.2015<br>Maturity Value **Rs. 39,764/-** | 05 | Available Bank balance as on 10.1.201**3**<br>**Rs. 1,36,087.66**<br>Indian Overseas BankFlexi Fixed A/C No:29152 **-** |

జైబాబా..మెహెర్‌బాబా పత్రిక జీవిత సభ్యత్వంగా రూ. 10 వేలు ఆపైబడి విరాళం పంపినవారికి గత 10 సంవత్సరాలు పైగా ప్రచురించిన మెహెర్‌బాబా సంచికలను అందమైన బైండింగ్‌లో బహుకరించాలని నిర్ణయించాం. ఈ బైండింగ్ వాల్యూంలు పరిమితంగా సంఖ్యలో మాత్రమే ఉన్నాయని గమనించగలరు...ఎడిటర్

# 2013-సింహావలోకనం

జనవరి 2014 మెహెర్‌బాబా సంచిక మీ చేతిలో వుంది. ప్రతి నెలా మీకు పంపుతున్న సందేశాలు అనేకం ఆసక్తికరంగా అందజేయాలని మా శక్తి మేరకు కృషి చేస్తున్నాం. మెహెర్‌బాబా సందేశాల వ్యాప్తికి సంపూర్ణంగా అంకితమైన మాసపత్రిక మెహెర్‌బాబా. కాగా, 2013 జనవరి నుండి డిసెంబరు దాకా మెహెర్‌బాబా సంచికలలో ప్రచురించిన పలు ప్రధాన విషయాలను సంక్షిప్తంగా ఒకసారి సింహావలోకనం చేసుకుందాం!! వర్తమానం భవిష్యత్తుకు మార్గదర్శకం కదా!

ప్రధానంగా 2013లో రెండు పెద్ద ప్రేమిక సహవాస్‌లు జరిగాయి.

1) కొవ్వూరు మెహెర్‌స్థాన్ పసిడి పండుగ వేడుకలు ఘనంగా ఫిబ్రవరి 27, 28 తేదీలలో జరిగాయి.

2) ఉత్తర కాశీ యాత్రలో ఏప్రిల్ 10,11 తేదీలలో

3) పూనే నుండి మెహెరాబాద్‌కు నవంబరు 23-27 తేదీలలో నిర్వహించిన ఐదురోజుల పాదయాత్రలో తెలుగువారు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఈ సమావేశాలకు హాజరుకాలేకపోయిన అనేకమంది బాబా ప్రేమిక పాఠకలోకానికన్నట్లు ఆయా సహవాస్ వివరాలను యథాతథంగా అందజేసే ప్రయత్నం చేశాం.

2013 జనవరి నుండి డిసెంబరు వరకు అనేక ప్రత్యేక శీర్షికలతో అవతారుని సందేశాలు ప్రచురించడమైంది. ముఖ్యంగా "మెహెర్‌బాబాతో కృష్ణనాయర్" శీర్షికతో ధారావాహిక సీరియల్ ప్రారంభించి – అవతారుని సమక్షంలో గడిపిన కృష్ణనాయర్ చెప్పిన అనేక ఆసక్తికర, ఆధ్యాత్మిక విషయాలను ప్రచురించాం. అనంతరం మెహెర్‌బాబాకు అత్యంత సన్నిహితుడు, 1920వ దశకం నుండీ తుదిశ్వాస వదిలేవరకు మెహెర్‌బాబా చెంతనే గడిపిన గుస్తాద్‌జీ గురించి 2012 ఆగస్టు సంచిక నుండి ధారావాహిక సీరియల్‌గా ప్రారంభించాం. కాగా అంతక్రితం 2011 జూలై నుండి భగవదన్వేషకుడిగా అవతారుని పాదాల చెంతకు చేరిన కైఖుస్రూ జంషెడ్‌జీ ప్లీడర్ – యదార్ధ జీవితగాధను సుమారు ఆరు మాసాలుపైగా ప్రచురించాం. ఈ మూడు కథనాలు (ప్లీడర్, కృష్ణనాయర్, గుస్తాద్‌జీ) గత ఏడాదిన్నర కాలంగా మెహెర్‌బాబా సంచిక పాఠకులను ఉర్రూతలూగించాయని ప్రత్యేకంగా చెప్పాల్సిన పన్లేదు. ఈ ముగ్గురు వ్యక్తులు మూడు కోణాల్లో భిన్నమైన వారు. అవతారుని సమక్షంలో వారు గడిపిన మధుర క్షణాలు – అమూల్యమైన అవతారుని సందేశాలు ఎన్నో ఈ మూడు శీర్షికలలో కనిపించాయని అనేక మంది పాఠకులు మాకు తెలియజేశారు. కాగా ప్రస్తుతాంశంలో సార్థకజన్ములు శీర్షికతో ఈ ముగ్గురి జీవన రేఖా చిత్రాలను గ్రంధస్తం చేసి బాబా ప్రేమికలోకానికి అందుబాటులో ఉంచాం. ప్రతి ఇంటా తప్పక ఉండవల్సిన, ప్రతి ఒక్కరూ చదవవల్సిన గ్రంధమని

పలువురు అభిప్రాయపడుతున్నారు. అలాగే ప్రత్యేక శీర్షికలుగా ఘజల్ గంధర్వ- శ్రీమతి బేగం అక్తర్, డా. ఘనీ మున్సిఫ్, మెహెర్‌బాబాతో సుభోధ్ చంద్రరాయ్ ఇంటర్వ్యూ, లాల్‌బహదూర్ శాస్త్రికిచ్చిన బాబా సాహిత్యం, బ్రహ్మైక్యం భూమ్మీదనే సాధ్యం వంటి అవతారుని సందేశం గత సంవత్సర సంచికలలో ప్రచురించాం.
అలాగే, తొలితరం పాశ్చాత్య బాబా ప్రేమికురాలు శ్రీమతి ఎలిజెబెత్ పాటర్‌సన్ , ఖోజాగూడా సహవాస్, మెహెర్‌బాబా నిర్వహించిన మనోనాశ్ కార్యక్రమాలపై ప్రత్యేక వ్యాసం ప్రచురించడమైంది. అవతార్ మెహెర్‌బాబా ప్రవచనాలు - 1. నిస్వార్థసేవ, 2.సంస్కారములు, 3. అవతారుడు శిష్యకూటమి, బాధలెందుకు?, వివాహం -దాని ప్రాముఖ్యత గురించి సవివరంగా పాఠకులకు అందజేశాం.
ముఖ్యంగా, 44వ అమరతిథికి మెహెరాబాద్ వెళ్ళే బాబా ప్రేమికుల సమాచార నిమిత్తం 2013 డిసెంబరు, 2013 జనవరి సంచికలలో అమరతిథి విశేషాలు, ఎగువ, దిగువ మెహెరాబాద్‌లలో ప్రధానమైన దర్శనీయ స్థలాల గురించి సంక్షిప్తంగా సమాచారం పాఠకులకు అందుబాటులో వుంచే ప్రయత్నం చేశాం.
ముఖ్యంగా, మల్లాది రామారావుగారి కలంలో - మెహెర్ ప్రభు - లార్డ్ మెహెర్ (1925 - 1930) ధారావాహిక సీరియల్‌గా 2005 జనవరి నుండి మెహెర్‌బాబా సంచికలో గత తొమ్మిది సంవత్సరాలుగా ప్రచురిస్తున్నాం. బాబా ప్రేమిక పాఠకులు ముఖ్యంగా మహిళలు ఈ సీరియల్‌ను ఎంతో ఆసక్తితో, అనురక్తితో బద్రపరుచుకుంటున్నారని తెలిసి మేమెంతో సంతోషిస్తున్నాం.
2013 అక్టోబరు 14న బాబా ప్రేమికులు శ్రీ వై.యస్.రావు, 2013 అక్టోబరు 23న బాబా ట్రస్టు చైర్మన్ శ్రీ భావూ కల్చూరీ అవతారునిలో ఐక్యమయ్యారు.
అవతారుని ఆశీస్సులు అందుకున్న ధన్యులు వీరు.

**అలాగే 2013 సంవత్సరంలో పలువురు బాబా ప్రేమికులు శ్రీ గోవిందరావు,**
**శ్రీ ద్విభాష్యం వెంకట సత్యనారాయణ మూర్తి, శ్రీ బసవపున్నయ్య,**
**శ్రీమతి ఎ.కె. వసుమతి, చెన్నై,**
**శ్రీ ఎ.వి.జి. గణేష్, బెంగళూరు,**
**శ్రీమతి రెంటాల కనక రత్నం,**
**శ్రీ నాగభూషణం, విజయనగరం,**
**శ్రీ గూడా వేంకట రామయ్య (98)**
**శ్రీ బుద్దయ్య గుప్త, రామాయంపేట, శ్రీ మెహెర్ మహమ్మద్, శ్రీమతి సత్యవతి,**
**శ్రీమతి యడ్ల వెంకట రమణమ్మ, ధవళేశ్వరం,**
**శ్రీమతి ఎర్రాయమ్మ, బాబాలో ఐక్యమయ్యారు.**
**వీరందరూ ధన్యులు.**

# ప్రభుస్తుతి

## ప్రభుస్తుతి

ఓ పర్‌వర్దిగార్,
సర్వపోషకా! సర్వ రక్షకా!
నీవు ఆదియును
అంతమును లేని వాడవు,
అద్వయుడవు,
నిరుపమానుడవు,
నీ ప్రమాణమెవ్వరును
ఎరుంగనేరరు
నీవు వర్ణము,
నామము,
రూపము,
గుణములు లేని వాడవు.
నీవు అపరిమితుడవు
గంభీరుడవు,
ఊహాతీతుడవు,
భావనాతీతుడవు,
శాశ్వతుడవు
నాశము లేని వాడవు.
నీవు అవిభాజ్యుడవు,
దివ్యచక్షువులతో గాని
నిన్నెవరును చూడజాలరు
నీవు ఎల్లప్పుడు నుంటివి,
నీవు ఎల్లప్పుడు నున్నావు
నీవు ఎల్లప్పుడు నుందువు
నీవు అంతటను గలవు,
నీవు అన్నింట నున్నావు.
మరి నీవు అంతటికి
అన్నింటికి
ఆవలనుందువు.
నీవు ఆకాశమును గలవు
పాతాళమున గలవు
నీవు వ్యక్తుడవు
అవ్యక్తుడవు,
అన్ని భూమికలందున్నావు,
అన్ని భూమికల కతీతుడవు.
నీవు మూడు
లోకాలలోనున్నావు
ముల్లోకాల కావలగూడ నున్నావు.
నీవు అగోచరుడవు,
స్వతంత్రుడవు.
నీవు సృష్టికర్తవు,
ప్రభువులకు ప్రభుడవు,
అందరి మనస్సులను
హృదయములను
ఎరిగిన వాడవు,
నీవు సర్వశక్తిమంతుడవు,
సర్వవ్యాపివి,
నీవే అనంతజ్ఞానము,
అనంత శక్తియు,
అనంత ఆనందమును.
నీవు జ్ఞానసాగరుడవు,
సర్వజ్ఞుడవు,
అనంత జ్ఞానివి,
త్రికాల వేదివి,
జ్ఞానమే నీవు,
నీవు సర్వదయాళుడవు,
నిత్య శుభంకరుడవు,
నీవు ఆత్మలకెల్ల నాత్మవు
అనంతగుణ విశిష్టుడవు,
నీవు సత్య, జ్ఞాన
ఆనందముల
త్రిమూర్తివి,
నీవే సత్యమునకు
మూలము,
ప్రేమ మహాసాగరుడవు,
నీవు పురాణ పురుషుడవు,
సర్వోత్తముడవు,
నీవు ప్రభుడవు,
పరమేశ్వరుడవు,
నీవు పరుడవు,
పరాత్పరుడవు,
నీవు
పరబ్రహ్మవు,పరమాత్మవు,
అల్లాహ్,
ఇలాహీ,
యజ్‌దాన్,
అహురమజ్ దా,
ప్రియతముడైన
భగవంతుడవు,
నీవు 'ఈజద్' అనబడు
ఏకైక పూజ్యుడవు.

# పశ్చాత్తాప ప్రార్థన

**ఓం పరబ్రహ్మ - పరమాత్మా**
**యా - యాజ్‌దాన్**
**లా ఇలాహ్ ఇల్లిల్లాహ్**
**ఓ గాడ్ ఫాదర్ ఇన్ హెవెన్**
**ప**రమ దయానిధివగు ఓ ఈశ్వరా!
మా పాపములన్నిటికిని
మేము పశ్చాత్తాప పడుచున్నాము
అసత్యము, అధర్మము,
అపవిత్రమును అగు
మా ప్రతి తలంపునకును,
పశ్చాత్తాప పడుచున్నాము.
పలికి యుండరాని పలికిన
ప్రతి మాటకును,
చేసి యుండరాని చేసిన
ప్రతి చేతకును,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
స్వార్థముచే ప్రేరేపింపబడిన
ప్రతి పనికిని, ప్రతి మాటకును
ప్రతి తలంపునకు,
ద్వేషముచే ప్రేరేపింపబడిన
ప్రతి పనికిని,
ప్రతి మాటకును
ప్రతి తలంపునకును,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
ఇంకనూ ముఖ్యంగా,
కామముతో కూడిన
మా ప్రతి తలంపునకును
కామ ప్రేరితమగు
మా ప్రతి చేతకును
పలికిన ప్రతి అనృతమునకును,
సమస్త కపటవర్తనమునకును,
ఆడి తప్పిన
ప్రతి వాగ్దానమునకును,
సమస్త పరనిందలకు,
పరోక్ష నిందలకు,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
ఇంకనూ, ముఖ్యముగా కూడా,
పరులకు నాశన మొనగూర్చునట్టి
మేము చేసిన ప్రతి పనికిని,
ఇతరులకు బాధ కలుగజేసినట్లు
మేమాడిన ప్రతి మాటకును,
చేసిన ప్రతి చేతకును,
ఇతరులకు బాధ కలుగవలెనని
మేము కోరిన ప్రతి కోర్కెకును,
మిక్కిలి పశ్చాత్తాపపడుచున్నాము.
నీ యొక్క అపార దయతో ఓ ఈశ్వరా!
మేము చేసిన
ఈ పాపములన్నిటిని
క్షమింప వేడుకొనుచున్నాము.
తలపులలో కాని, మాటలలో కాని
చేతలలో కాని
నీ ఇచ్ఛానుసారము నడుచుకొన జాలక
నిరంతరము విఫలులమగుచున్న
మమ్ములనందరిని క్షమింప
వేడుకొనుచున్నాము.

# మండలి ప్రార్థన

ప్రియ దైవమా!

నిన్ను అధికాధికముగా ప్రేమించునట్లును, ఇంకను అధికముగా నీతో ఐక్యమగునంతటి అర్హతగల వారమగునంతవరకును నిన్నింకను అధికముగ ప్రేమించునటుల మాకందరకు సహాయము చేయుము.

మరియు చిట్టచివరి వరకు బాబా కొంగును దృఢముగా పట్టుకొని ఉండుటకై మాకందరకు సహాయము చేయుము.

# జీవిత సభ్యతం

2014 జనవరి నెలలో పంపిన వారి వివరాలు

| నెం. | | పేరు, ప్రాంతము | చెల్లించిన సొమ్ము |
|---|---|---|---|
| **1.** | **జనవరి** | **జి. అంజయ్య, నిజామాబాద్** | **రూ. 1000.00** |
| | | **మొత్తం** | **రూ. 1000.00** |

# పత్రిక సభ్యత్వం

1. మెహెర్‌బాబా పత్రిక జీవిత సభ్యత్వం రూ. 1000/- (వెయ్యి రూపాయలు).
2. రెండు దఫాలుగా కూడా రూ.500/- చొప్పున చెల్లించవచ్చు.
3. జీవిత సభ్యత్వం చెల్లింపులపై వచ్చే వడ్డీని మాత్రమే పత్రిక నిర్వహణా ఖర్చులకు వినియోగించాలి. అయితే నేటి వరకు జీవిత సభ్యత్వంపై వచ్చిన వడ్డీని కూడా అసలు మొత్తానికే జమచేయడమైనది.
4. వార్షిక సభ్యత్వం రూ.100/- పోస్టల్ మనీ ఆర్డర్ ద్వారా పంపవలిసింది.
5. బ్యాంకు డ్రాఫ్టు లేదా బ్యాంకు చెక్కు ద్వారా పంపగోరు వారు శ్రీమతి నిర్మలాదేవి, హైదరాబాద్ పేరున పంపగలరు.

**మా అడ్రస్:**


**ఎడిటర్, మెహెర్‌బాబా,**<br>
**గోదావరి గార్డెన్స్,**<br>
**బాబాస్ హౌస్,**<br>
**యాప్రాల్,**<br>
**ప్లాట్ నెం.32,**<br>
**జె.జె. నగర్ కాలనీ,**<br>
**సికింద్రాబాద్-500087.**<br>
**ఫోన్:99595-53218,**<br>
**email: malladisukku@gmail.com**



Printed and published and owned by Dasika Nirmaladevi printed at Sai Srinivasa Printers, Khairatabad, Hyderabad, published at Koti Meher Centre, Esamia Bazar, Koti, behind Govt. Women's College, Hyderabad.

**Editor: D.Nirmaladevi**

RNI No. APTEL/2002/7310, Postal Concession: R&D/HSE/789/Dlgs/2014-2016, **Dt.06-01-2014**